ఇష్టారాజ్యంగా ఇటుక బట్టీల నిర్వహణ 8లో..
డబ్బులు వసూలు చేస్తున్న డీపీవోపై చర్యలు తీసుకోవాలి 8లో..



■ నిధులు రాలేదని సర్పంచ్‌ల్లో ఆందోళన..

జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి పనులకు సంబంధించి కొంతమంది సర్పంచులు సొంతగా ఖర్చు చేశారు. వాటికి సంబంధించి బిల్లులు ఇప్పటి వరకు విడుదల కాలేదని కొందరు సర్పంచులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో కొన్ని ప్రాంతాల్లో ఆందోళనలు, అధికారులు, ప్రజాప్రతినిధులకు వినతి పత్రాలు అందజేయడం, గోడు వెల్లబోసుకోవడం వంటి ఘటనలు చోటు చేసుకున్నాయి. జిల్లాలోని ట్రెజరీ కార్యాలయాల్లో గత యేడాది ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు సుమారు 2,683 చెక్కులకు సం బంధించిన సుమారు రూ. 17.97 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు సర్పంచ్‌లు అంటున్నారు.

ఇందులో జగిత్యాల ఎస్‌టీవో పరిధిలో 1,545 చెక్కులకు సంబంధించిన రూ. 12.28 కోట్లు, మల్యాలలో 376 చెక్కులకు సంబంధించిన రూ. 1.97 కోట్లు, కోరుట్ల ఎస్‌టీఓ పరిధిలో 334 చెక్కులకు సంబంధించిన రూ. 1.84 కోట్లు, మెట్‌పల్లి ఎస్‌టీవో పరిధిలో 428 చెక్కు లకు సంబంధించిన రూ. 1.87 కోట్లు బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు సంబంధిత వర్గాలు వాపోతున్నాయి. ఈనేపథ్యంలో పదవీ కాలం ముగియడంతో తమ పెండింగ్ బిల్లుల పరిస్థితి ఏమిటనీ వాపోతున్నారు.

సర్పంచులకు సెలవు

ముగిసిన పదవీ కాలం

- ప్రత్యేక అధికారుల పాలనకు అంతా రెడీ
- ఇప్పటికే సర్కారుకు చేరిన 'ప్రత్యేక' జాబితా
- స్పెషల్ ఆఫీసర్లను నియమిస్తూ విడుదలైన జీవో
- పెండింగ్ బిల్లులపై సర్పంచ్‌లలో ఆందోళన

జగిత్యాల, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలలో ప్రథమ పౌరుల పదవీ కాలం ముగుస్తోంది. ఈనెల 2వ తేదీతో పంచాయతీ పాలకవర్గాల గడువు ముగిసిపోతుండడంతో ప్రత్యేకాధికారుల పాలనకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. దీనిలో భాగంగా ఇప్పటికే జిల్లా వ్యా ప్తంగా అధికారుల నియామకం చేపట్టి, వారికి అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈనెల 2వ తేదీ నుంచి ప్రత్యేక పాలన నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించడంతో అందుకు సంబంధించి జిల్లా యంత్రాంగం ఏర్పాటు చేపట్టింది. ఇందుకు అనుగుణంగా జీవో నం 5ను సర్కారు జారీ చేసింది. ఇప్పటికే సర్పంచుల నుంచి డాక్యుమెంట్లు, డిజిటల్ కీలు అధికారులు స్వాధీనం చేసుకున్నారు. జిల్లాలోని అన్ని పంచాతీయల్లో ప్రత్యేక అధికారుల పాలన నిర్వహించడానికి అధికారులు సిద్ధంగా ఉన్నారు.

ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు...

గ్రామాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేపట్టేలా ప్రత్యేక అధికారులకు పూర్తి అవగాహన కల్పించారు. వారు ఆ యా గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీరు, అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు తీరును పూర్తిగా పర్యవేక్షించేలా సన్నద్ధం అయ్యారు. ఇప్పటికే బాధ్యత వహిస్తున్న పంచాయతీ కార్యదర్శులను సమన్వయం చేసుకుని పాలన సాగించేలా రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. ప్రత్యేక అ ధికారుల పాలన ఎప్పటి వరకు ఉంటుందో తెలియక పోవడంతో వారి పాలన ఎలా ఉంటుందోనన్న సందిగ్ధం నెలకొంది.

ప్రత్యేక అధికారులు వీరే...

జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో సర్పంచుల పాలన ముగుస్తుం డటంతో ప్రత్యేక అధికారులకు పాలన బాధ్యతలు అప్పగించ నున్నారు. ఏఏ పంచాయతీకి ఏఏ శాఖల అధికారులు బాధ్యత వహిస్తారో అధికారులు నిర్ణయించారు. మేజర్, అధిక జనాభా కలిగిన పంచాయతీల వారీగా ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ప్రధానోపాధ్యాయులు, మండల పం చాయతీ అధికారులు, పంచాయతీ రాజ్ సహాయ ఇంజనీర్లు, మండల విద్యాధికారులు, పశు వైద్యాధికారులు, ఆరోగ్యశాఖ సూపర్ వైజర్లు, ఉద్యాన అధికారులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, మండల పరిషత్ సూపరింటెండెంట్లు, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, వ్యవసాయ విస్తరణ అధికారులు, స్కూల్ అసిస్టెంట్లు, డిప్యూటీ తహసీల్దార్లకు ప్రత్యేక అధికారుల బాధ్యత అప్పగించేందుకు అధికారులు కార్యాచరణ రూపొందించారు.

అత్యవసర పనులే...

పంచాయతీల్లో ప్రత్యేక అధికారుల పాలనలో శాశ్వత పనుల నిర్వహణకు పెద్దగా అవకాశం ఉండదన్న అభిప్రాయాలున్నాయి. ప్రధానంగా ప్ర త్యేక అధికారులు గ్రామాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా అత్యవసరమైన తాగునీరు, పారిశుధ్యం, వీధి లైట్లు, డ్రైనేజీ తదితర ప నులు నిర్వహించాల్సి ఉంటుంది. పెద్ద పనులైతే టెండర్ల ద్వారా చేపట్టాల్సి ఉంటుంది. గతంలో మూడు గ్రామాలకు ఒకరు ప్రత్యేక అధికారిగా వ్యవహరించగా...అప్పటి బీఆర్ఎస్ తండాలను కొత్త పంచాయతీలుగా ఏర్పాటు చేసి అన్ని పంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియమించింది. ప్రస్తుత ప్రభుత్వం అదే తరహాలో పంచాయతీకి ప్రత్యేక అధికారిని నియమించింది.

2019 జనవరిలో ఎన్నికలు...

జిల్లాలోని గ్రామ పంచాయతీలకు 2019 జనవరిలో ఎన్నికలు జరిగాయి. మూడు విడతలుగా ఎన్నికలు పూర్తి చేసిన అనంతరం ఫిబ్రవరి 2వ తేదీన పంచాయతీల్లో పాలకవర్గాలు ప్రమాణ స్వీకారం చేసి కొలువుదీరాయి. 2024 ఫిబ్రవరి 1వ తేదీతో ఐదేళ్లు కావడంతో వారి పదవీకాలం పూర్తవుతుంది. నిబంధనల ప్రకారం పదవీకాలం పూర్తయ్యేలోగా ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. ఎన్నికల సంఘం అందుకు సంబంధించి ఏర్పాట్లు చే సుకున్నప్పటికీ ప్రభుత్వం ముందుకు రాలేదు. త్వరలో పార్లమెంట్ ఎన్నికలు జరిగే అవకాశం ఉన్నందున దాన్ని దృష్టిలో పెట్టుకుని ఆ ఎన్నికల తర్వాత పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది.

పకడ్బందీగా ప్రత్యేక పాలన నిర్వహిస్తాము

దేవరాజ్, జిల్లా పంచాయతీ అధికారి, జగిత్యాల



జిల్లాలోని అన్ని పంచాయతీల్లో పకడ్బందీగా ప్రత్యేక అధికారులచే పాలనను నిర్వహించడానికి అవసరమైన చర్యలు పూర్తి చేశాము. ఇందుకు అనుగుణంగా అధికారులను ఎంపిక చేసి ఇప్పటికే ఆర్డర్ పత్రాలను అందజేశాము. సర్పంచ్‌ల నుంచి రికార్డులు, డిజిటల్ కీలు స్వాధీనం చేసుకుంటున్నాము. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని విధాల జాగ్రత్తలు తీసుకుంటున్నాము.

బకాయి ఉన్న ప్రతి పైసా ప్రభుత్వం చెల్లిస్తుంది

- సర్పంచులు ఆందోళన చెందవద్దు
- ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి


సర్పంచ్ రమ్యను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ టి. జీవన్‌రెడ్డి

జగిత్యాలరూరల్, ఫిబ్రవరి 1 : సర్పంచులు ఆందోళన చెందవద్దని, ప్రతి పైసా బకాయి ప్రభుత్వం చెల్లిస్తుందని ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి భరోసా కల్పించారు. జగిత్యాల రూరల్ మండలం తిమ్మాపూర్ గ్రామపంచాయతీ పాలక వర్గం పదవీ కాలం ముగిసిన సందర్భంగా సర్పంచ్ మేరుగురమ్యలక్ష్మణ్‌తో పాటు పాలకవర్గాన్ని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ సోనియాగాంధీ రూపొందించిన జాతీయగ్రామీణ ఉపాధిహామీపథకం గ్రామీణ నిరుపేద కూలీలకు వరంగా మారిందని అన్నారు. కాంగ్రెస్ పాలనలో ఊరూర తారురోడ్డువేసి గ్రామాలను అభివృద్ధి చేశామని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉందని, ఇప్పటికే మహిళలకు ఉచితబస్సుప్రయాణం తోపాటుగా, రాజీవ్ ఆరోగ్యశ్రీకింద రూ. 10లక్షల వరకు ఉచితవైద్యసదుపాయం అమలు చేస్తుందని తెలిపారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్‌నాయకులు ఇమ్మడి ధర్మయ్య, మనీందర్ రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

కొడిమ్యాల : మండలంలోని చెప్యాల గ్రామ సర్పంచు ఊటు కూరి రాజశేఖర్‌రెడ్డి, ఉప సర్పంచు ఎల్లయ్య, పాలక వర్గ సభ్యులను పదవీ కాలం ముగిసిన సందర్భంగా గురువారం గ్రామస్థులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఎంపీటీసీ మల్లారెడ్డి, మాజీ సర్పంచు రాజేశం, విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు నర్సింహాచారి, చత్రపతి శివాజీ యూత్ అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, రెడ్డి సం ఘం అధ్యక్షుడు సునీల్‌రెడ్డి, గ్రామ నాయకులు, యువకులు పంచాయతీ సభ్యులు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు. మండలంలోని తిప్పయ్యపల్లి గ్రామంలో సర్పంచు మ్యాకల లత మల్లేశంయాదవ్‌ను గ్రామస్థులు శాలువా కప్పి ఘనంగా సన్మా నించారు.

రద్దీ రోజుల్లో ఆర్జిత సేవలు బంద్

మల్యాల, ఫిబ్రవరి 1: సమ్మక్క-సారక్క జాతల నేపథ్యంలో తొలిమొక్కుల కోసం కొండగట్టు అంజనేయస్వామి దర్శనానికి తండోపతండాలుగా వస్తున్న భక్తులకు అసౌకర్యం కలుగకుండా రద్దీగా ఉండే రోజుల్లో ఆర్జిత సేవలను నిలిపివేయనున్నట్లు ఈవో వెంకటేష్ తెలిపారు. భక్తుల రద్దీ అధికంగా ఉండే శనివారం, ఆదివారం, మంగళవారం రోజుల్లో అర్జిత సేవలు నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 20 వరకు ఆయా రోజుల్లో వాహనపూజలు, అభిషేకాలు, సత్యనారాయర వ్రతాలు తదితర సేవలు ఉండవని భక్తులు గమనించగలరని ఈవో కోరారు.

సమ్మె నోటీస్ అందజేత

పెగడపల్లి, ఫిబ్రవరి 1 : ఫిబ్రవరి 16న దేశవ్యాప్తంగా జరిగే కార్మికుల సమ్మెలో పాల్గొంటామని పేర్కొంటూ గురువారం మండల మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ సమ్మె నోటీస్‌ను ఎంఈవో కార్యాలయంలో అందజేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా చేపట్టిన సమ్మెలో భాగంగా తాము పా ల్గొనను న్నట్లు పేర్కొంటూ నోటీస్ అందజేశారు. ఏఐటీయుసీ జిల్లా ఉపాధ్యక్షులు ఇరుగురాల భూమేశ్వర్, మండల కన్వీనర్ రాచర్ల సురేష్, తాండ్ర విజయ ఉన్నారు.

టెక్నాలజీకి అనుగుణంగా విధులు నిర్వహించాలి

ఎస్పీ సన్ ప్రీత్ సింగ్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ

జగిత్యాల టౌన్, ఫిబ్రవరి 1: మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా పోలీస్ అధికారులు విధులు నిర్వహించాలని ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ట్రాఫిక్ శిక్షణ కేంద్రంలో గురువారం జిల్లాలో పనిచేస్తున్న పోలీస్ అధికారులకు పోలీస్ శాఖ ఉపయోగిస్తున్న వివిధ అంశాలకు సంబంధించి ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్పీ హాజరై మాట్లాడుతూ నిందితుల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ప్రభాకర్ రావు, డీఎస్పీలు రవీంద్ర కుమార్, రవీంద్ర రెడ్డి తదితరులు ఉన్నారు.

ఆపరేషన్ స్మైల్ విజయవంతం..

అన్ని శాఖల సమన్వయంతో ఆపరేషన్ స్మైల్ విజయవంతం అయినట్లు ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ పేర్కొన్నారు. జిల్లాలో జనవరిలో నిర్వహించిన ఆపరేషన్ ముస్కాన్, స్మైల్ కార్యక్రమాల అమలుపై అధికారులతో ఎస్పీ సమీక్ష నిర్వహించి మాట్లాడారు. జిల్లాలో 45 మంది బాల కార్మికులను గుర్తించి వెట్టి చాకిరి నుంచి విముక్తి చేసినట్లు వివరించారు. బాలల హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పోలీస్ శాఖతో కలిసి ఆపరేషన్ స్మైల్ విజయవంతం చేయడంలో కృషి చేసిన వివిధ శాఖల అధికారులను, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

రైతులు రుణాలు సద్వినియోగం చేసుకోవాలి

డీసీఎంఎస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి

ధర్మపురి, ఫిబ్రవరి 1: రైతులకు సొసైటీ ద్వారా తక్కువ వడ్డీతో పొందిన రుణాలు సద్వినియోగం చేసుకోవాలని డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి కోరారు. ధర్మపురి పీఏసీఎస్ కార్యాలయం ఆవరణలో సొసైటీ పరిధిలో గల నలుగురు రైతులకు రూ 24,00,000 దీర్ఘకాలిక రుణాలు సంబంధించిన చెక్కులను గురువారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ రైతులు సొసైటీ ద్వారా పొందిన రుణాలు తిరిగి సకాలంలో చెల్లించాలని అన్నారు. రైతుల శ్రేయస్సు దృష్ట్యా సంఘం పరిధిలో గల రైతులకు వ్యవసాయ బావులు తవ్వి, విద్యుత్ మోటార్లు కొనుగోలు చేసి, పైపు లైన్ ఏర్పాటు కోసం ఈ రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఇందులో ఒడ్నాల కిషన్, ఒడ్నాల చంద్రకళ, నేరుగొమ్ముల వకుళ, తాండ్ర భూమారావు ఒక్కొక్కరు రూ 6,00,000 రుణాలు పొందినట్లు ఆయన వివరించారు. పంట పెట్టుబడి, చిరు వ్యాపారాలు, పశువులు, వాహనాలు కొనుగోలు కోసం కూడ రుణాలు అందించినట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి పీఏసీఎస్ సీఈవో అయ్యోరు రాజేష్, పాలకవర్గ సభ్యులు పెరుమాండ్ల ఎల్లాగౌడ్, కుమ్మరి రవి, రైతులు పాల్గొన్నారు.

తలనీలాల టెండర్లు మళ్లీ వాయిదా

మల్యాల, ఫిబ్రవరి 1: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధిలో సేకరించే తలనీలాల టెండర్లు మళ్లీ వాయిదా పడ్డాయి. ఏడాది కాల పరిమితికి గాను ఇదివరకే అయిదు సార్లు టెండర్లు నిర్వహించగా కాంట్రాక్టర్లు పాల్గొనక పోవడంతో వాయిదా పడ్డాయి. తాజాగా గురువారం ఆన్‌లైన్, షీల్డ్, బహిరం గవేలం నిర్వహించారు. బహిరంగ వేలంలో ముగ్గురు పాల్గొనగా రూ.1.25 కోట్లకు రాగ షీల్డ్ టెండర్‌లో రూ.90లక్షలు, ఆన్‌లైన్‌లో రూ.1,61,05,555లకు కాంట్రాక్టర్ పాల్గొన్నాడు. క్రితం సారి ఏడాదికి గాను రూ.3.65కోట్లు కాగ ప్రస్తుతం రూ. 1.61కోట్లు మాత్రమే పలుకడంతో సరైన ధరలు రానందున అధికారులు వాయిదా వేశారు. గత ఆగస్టు నుంచి డిసెంబరు వరకు దేవస్థానం తరుపున సేకరించిన తలనీలాలకు కిలోకు రూ.7600 పలికినట్లు అధికారులు తెలిపారు. దీన్ని కమిషనర్‌కు నివేదించి తదుపరి ఉత్తర్వుల మేరకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. వేలంలో ఈవో వెంకటేష్, ఏసీ చంద్రశేఖర్, ఏఈవో బుద్ది శ్రీనివాస్, పర్యవేక్షకులు శ్రీనివాస్‌శర్మ, సునీల్, ఉమామహేశ్వర్ పాల్గొన్నారు.

నర్సరీల పరిశీలన

మల్యాల, ఫిబ్రవరి 1: మండలంలోని బల్వంతాపూర్, సర్వాపూర్‌లో గల నర్సరీలను ఎంపీడీవో వెంకటేశం పరిశీలించారు. హరితహారానికి మొక్కలను సిద్ధం చేయాలని సూచించారు. అనంతరం అంగన్వాడీ కేంద్రాలను కూడా తనిఖీ చేశారు. ఎంపీడీవో వెంట పంచాయితీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఆకట్టుకున్న సంగీత, నృత్య కార్యక్రమాలు

వేములవాడ, ఫిబ్రవరి 1: వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానంలో నిర్వహిస్తున్న శ్రీత్యాగరాజ స్వామి వారి ఆరాధన ఉత్సవాలలో భాగంగా మూడోరోజు గురువారం నిర్వహించిన కార్యక్రమాలు కళాభిమానులను ఆకట్టుకున్నాయి. ఉదయం జయంతి సావిత్రి భాగవతారిణి హరికథ విని పించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. అనంతరం శ్రావ్య, రేవతి సంగీత కచేరితో ప్రేక్షకులను అలరించారు. మధ్యాహ్నం కూచిభట్ల వెంకటరమణ భాగవతార్ హరికథతో రంజింపచేశారు. సాయంత్రం అనుపమ, అభిరాంల సంగీత కచేరి, శ్రీవిద్య శాస్త్రీయ సంగీత కచేరి హృద్యం గా సాగింది. రాత్రి మంగళంపల్లి సూర్యదీప్తి వైలెన్ సోలో కచేరితో ప్రేక్షకులను మైమరిపింపచేశారు. అనంతరం ముత్తా పరమేశ్వర్, నృత్యరవళి కళాక్షేత్రం వారి నృత్య ప్రదర్శన, తోట సతీష్ బృందం నృత్య ప్రదర్శన ఆకట్టుకున్నాయి.

స్టాఫ్ నర్సు పోస్టులకు ఎంపిక

రాయికల్, ఫిబ్రవరి 1: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన ఫలితాలలో రాయికల్ పట్టణానికి చెందిన నలుగురు, మూటపెల్లి గ్రామానికి చెందిన ఒకరు స్టాఫ్ నర్సు పోస్టులకు ఎంపికయ్యారు. గత ప్రభుత్వం స్టాఫ్ నర్సు ఉద్యోగ భర్తీ పోస్టుల ప్రక్రియను పూర్తి చేయగా బుధవారం కాంగ్రెస్ ప్రభుత్వం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేతులమీదుగా రాయికల్‌కు చెందిన మరిపెల్లి అపర్ణ, ఆసరి గంగజల, వీరబత్తిని సంగీత, చెంగలి జ్యోతి, మూటపల్లి గ్రామానికి చెం దిన అరుగుల ఉమలు నియామక పత్రాలను అందుకున్నారు. వీరిని ప్రజాప్రతినిధులు అభినందించారు.

పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

గొల్లపల్లి, ఫిబ్రవరి 1: పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశు వైద్యాధికారి వేణుగోపాల్ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో గురువారం పీవీ నర్సింహారావు తెలంగాణ పశు వైద్య విశ్వ విద్యాలయం పశు వైద్య కళాశాల కోరుట్ల, పశు వైద్య, పశు సంవర్థక శాఖ జిల్లా శాఖ ఆధ్వర్యంలో పశు వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. ఈ శిబిరాల్లో 300 పశువులకు గర్భకోశ వ్యాధులకు సంబంధించిన చికిత్సలు, 200 మెడిసిన్ చికిత్సలను, 10 శస్త్ర చికిత్సలను నిర్వహించారు. కోరుట్ల వెటర్నరీ కళాశాల అసోసియేట్ తక్కల్లపల్లి మాధవ రావు, టీఎస్ఎల్‌డీఏ కరీంనగర్ ఈవో డాక్టర్ శ్రీధర్, ఎంపీడీవో నవీన్ కుమార్, మండల పశు వైద్యాధికారి రవీందర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అంబిక, డాక్టర్ సురేష్, డాక్టర్ పరశురాములు, పశు సంవర్ధక శాఖ వైద్యులు తిరుపతి గౌడ్, రాజేందర్ పాల్గొన్నారు.

ఎంపీడీవోకు పంచాయతీ కార్మికుల వినతి

కొడిమ్యాల, ఫిబ్రవరి 1 : ఈ నెల 16న దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న సమ్మెను విజయవంతం చేయాలని పంచాయతీ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు కోమటి చంద్రశేఖర్ కోరారు. గురువారం గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్, వర్కర్స్ యూనియన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయటానికి సమ్మె నోటీస్‌ను గ్రామ పంచాయతీ కార్మికులు ఎంపీడీవో పద్మ జరాజీకి వినతి పత్రం అందించారు. జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ పంచాయతీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను ప్రభుత్వం చెల్లించాలన్నారు. దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న సమ్మెలో భవన నిర్మాణ కార్మికులు, హమాలీ కార్మికులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, గ్రామ పంచాయతీ కార్మికులు పాల్గొనాలని కోరారు. వినతి పత్రం అందించిన వారిలో దేవయ్య, నవీన, హన్మయ్య, పలువురు పంచాయతీ కార్మికులు ఉన్నారు.

'గావ్ చలో-బస్తీ చలో' విజయవంతం చేయాలి

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణి

రాయికల్, ఫిబ్రవరి 1: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన గావ్ చలో బస్తీ చలో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణి అన్నారు. బీజేపీ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం 10 సంవత్సరాలుగా ఊహకు కూడా అందని సాధారణ అభివృద్ధి సాధించిందని, అభివృద్ధి దార్శనికతకు కేంద్ర, రాష్ట్ర బీజేపీ ప్రభుత్వాలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లడం ద్వారా 2024 లోక్‌సభ ఎన్నికల్లో ప్రజల మద్దతు కూడగొట్టి యావత్ భారతదశ ప్రజల విశ్వాసాన్ని చూరగొనాలన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రవాసీ కార్యకర్తలు ప్రతి గ్రామానికి, ప్రతి వీధికి వెళ్లి గ్రామంలో తిరుగుతూ స్థితి గతులను పరిశీలించి అధ్యయనం చేయాలన్నారు. గ్రామంలో బూత్ కమిటీలను అధ్యయనం చేసి అక్కడ ఉన్న వివిధ సంఘాల నేతలు, కవులు, కళాకారులు, క్రీడాకారులను కలిసి కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి వివరించి గ్రామంలోని సమస్యల గురించి చర్చలు జరుపాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల బూత్ అధ్యక్షులను నియమించారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ కో కన్వీనర్ గుంటుక సదాశివం, రాయికల్ పట్టణ అధ్యక్షుడు కల్లెడ ధర్మపురి, రాయికల్ మండల అధ్యక్షుడు అన్నవేణి వేణు, ఎంపీటీసీ మహేష్, ఉపాధ్యక్షుడు పసునూరి శ్రీనివాస్, కన్వీనర్ సామర్ల సతీష్, కో కన్వీనర్ బుర్ల గోపి, మచ్చ నారాయణ, మూగల మారుతి, కుర్మ మల్లారెడ్డి, మంగళారపు లక్ష్మీనారాయణ, తొగిట లక్ష్మీనారాయణ, బాలశేఖర్, రాజగోపాల్, బూత్ అధ్యక్షులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న బోగ శ్రావణి

రైస్‌మిల్‌పై చర్యలేవీ..?

- అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన కరువు
- తనిఖీల పేరిట కాలయాపన
- సెంట్రల్ విజిలెన్స్ కమిషన్‌కు ఫిర్యాదు చేసిన గ్రామస్థుడు


రైస్‌మిల్‌లో తనిఖీలు నిర్వహించిన విజిలెన్స్ అధికారులు(ఫైల్)

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 1: అడ్డదారిలో రైస్‌మిల్‌కు ధాన్యం కేటాయింపుపై అధికారుల చర్యలు కానరావడం లేదు. కొద్ది రోజుల కింద మాజీ సర్పంచ్ మంత్రికి, అధికారులు ఫిర్యాదు చేశాడు. తాజాగా జిల్లా అధికార యంత్రాంగం సరైన విధంగా స్పందించడం లేదని ఆరోపిస్తూ గ్రామానికి చెందిన యువకుడు ఈ నెల 29న ఆన్‌లైన్‌లో సెంట్రల్ విజిలెన్స్ కమిషన్‌కు ఫిర్యాదు చేయడంతో పాటు ప్రజావాణిలో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన రైస్‌మిల్‌లో పనులు పూర్తి కాకుండానే ధాన్యం కేటాయించడంపై గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ సల్లా సునీల్ జనవరి 9న మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డికి, రాష్ట్ర సివిల్ సప్లై అధికారులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన అధికారులు 11వ తేదిన ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ అధికారులు రైస్‌మిల్‌లో సోదాలు నిర్వహించారు. ఓఎస్‌డి ప్రభాకర్‌తో పాటు సిబ్బంది యంత్రాలను, కరెంట్, గోదాంతో పాటు పలు రికార్డులను పరిశీలించారు. రికార్డులను పరిశీలించి నివేదికలను ఉన్నతాధికారులకు సమర్పించారు. ఇంత వరకు బాగానే ఉన్నా అసలు విషయం పక్కన పెట్టి తనిఖీలు చేయడం పట్ల అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి. రైస్‌మిల్ పనులు పూర్తి కాకుండనే ధాన్యం ఎలా కేటాయించారని ఫిర్యాదు చేస్తే ఆ విషయాన్ని పక్కన పెట్టడం వెనుక ఉన్న అంతర్యమేమిటో అర్థం కావడం లేదు. జిల్లాలో నూతనంగా ఒకటి రెండు చోట్ల రైస్‌మిల్ పూర్తి కాగా సదరు రైస్ మిల్లర్లు తమకు ధాన్యం కేటాయించాలని మొరపెట్టుకున్నా అధికారులు పట్టించుకోలేదనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. రైస్‌మిల్‌లో అక్రమాలు జరిగాయంటూ గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ సల్లా సునీల్ ఏకంగా మంత్రికి, రాష్ట్ర, జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసినా అధికారులు మాత్రం చర్యలు తీసుకు నేందుకు వెనుకడుగు వేస్తున్నారు. దింతో అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికైన కలెక్టర్ స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

దాడి కేసులో ఇద్దరికి మూడేళ్ల జైలు

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 1: దాడి కేసులో ఇద్దరికి మూడేళ్ల జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ. 10వేల జరిమానా విధిస్తూ సిరిసిల్ల ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ గురువారం తీర్పు ఇచ్చారు. సిరిసిల్ల టౌన్ సిఐ రఘుపతి తెలిపిన వివరాల ప్రకారం.. సిరిసిల్ల పట్టణంలోని సంజీవయ్యనగర్‌కు చెందిన రాగుల రాములు అనే వ్యక్తి కుటుంబంపై పాత పగలు మనసులో పెట్టుకొని సిరిగిరి అనిల్, మేకల కమలాకర్, సిరిగిరి యాదగిరి ప్రమీలలు నవంబరు 17, 2013న కర్రలతో రాములపై దాడిచేశారు. ఈ దాడిలో రాములు తీవ్రంగా గాయపడగా సిరిసిల్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదుచేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసులో సిఎంఎస్ ఎస్సైఐ శ్రావణ్ ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ వేముల నరేశ్ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా ప్రాసిక్యూషన్ తరుఫున పిపి చెలుముల సందీప్ వాదించారు. నిందితులైన సిరిగిరి అనిల్ , మేకల కమలాకర్‌లకు మెజిస్ట్రేట్ మూడేళ్ల జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ. 10వేల జరిమానా విధించారని, మిగితా ఇద్దరు మరణించారని సిఐ తెలిపారు.

కవిత్వం సామాజిక చైతన్యానికి చిరునామా

● జిల్లా విద్యాధికారి జనార్దన్‌రావు

తిమ్మాపూర్, ఫిబ్రవరి 1: కవిత్వం, సామాజిక చైతన్యానికి చిరునామా అని జిల్లా విద్యాధికారి జనార్ధన్‌రావు అన్నారు. గురువారం ఎల్ఎండి కాలనీలోని జిల్లా విద్యా శిక్షణా సంస్థ (డైట్)లో నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడుతూ ఛాత్రోపాధ్యాయుల వృత్తి శిక్షణలో భాగంగా వివిధ రకాలైన సాహిత్య ప్రక్రియలను నేర్చుకోవాలన్నారు. కవిత్వంతో విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక శక్తులను బయటకు తీయవచ్చన్నారు. కవిత్వం సామాజిక చైతన్యానికి చలనశీలతకు దర్పణం అని, కవితలు రాయడం అలవర్చుకోవాలన్నారు. అనంతరం కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత వారాల ఆనంద్ విద్యార్థులకు కవిత్వ కార్యశాలను న్విహించారు. ప్రతి ఒక్కరిలో మానవీయ కోణం దాగి ఉంటుందని అందుకే ప్రతి వారు కవులు కావాలని ఆకాంక్షించారు. విద్యార్థి దశ నుంచే కవిత్వ రచన మెళకువలు నేర్చుకుంటే కవిత్వంపై పట్టు సాధించవచ్చన్నారు. ఛాత్రోపాధ్యాయులు, అధ్యాపకులతో కవిత్వం రాయించారు. ఈ సందర్భంగా వారి స్వీయ కవిత్వంతో పాటు వివిధ తెలుగు కవుల కవిత్వాన్ని ఉర్దూ కవి అయిన గుల్జార్ కవిత్వాన్ని చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో డైట్ ప్రిన్సిపాల్ శ్రీరాం మొండయ్య, ఛాత్రోపాధ్యాయులు డాక్టర్ కె శంకర్, జి మహేశ్వర్‌రెడ్డి, గాజుల రవీందర్, శ్రీనివాస్‌రెడ్డి, మంజుల, హబీబ్ ఉరు రహమన్, అబ్దుల్ రవుఫ్, ఖయ్యూం, సురేఖ, శ్రీలత పాల్గొన్నారు.

ఆలయంలో చోరీ

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 1: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని సద్దిమద్దుల సంఘం సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయంలో బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారని స్థానికులు తెలిపారు. ఆలయంలోని చొరబడిన దొంగలు హుండీని ధ్వంసం చేసి నగదును అపహరించుకుపోయారు. గురువారం ఉదయం ఆలయంలో పూజలు చేయడం కోసం వెళ్లిన భక్తులకు హుండీ తాళం పగులకొట్టి కనిపించడంలో ఆలయ కమిటీ సభ్యులుకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. రెండు రోజుల కిందట శివాలయం, శ్రీవేణుగోపాలస్వామి బాలాలయంలో చోరీకి యత్నించిన ఘటన మరువక ముందే ఆంజనేయస్వామి ఆలయంలో చోరీకి పాల్పడడంతో గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. పోలీసులు రక్షణ కల్పించాలని కోరుతున్నారు.

రూ.6,600 పలికిన పత్తి ధర

జమ్మికుంట, ఫిబ్రవరి 1: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.6,600 పలికింది. గురువారం స్థానిక వ్యవసాయ మార్కెట్‌కు 92మం ది రైతులు 890క్వింటాళ్ల విడి పత్తి, ఏడుగురు రైతులు 17క్వింటాళ్ల గోనె సం చుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం ద్వారా గరిష్ఠ ధర రూ.6,800,కనిష్ఠ ధర రూ.5,200 చెల్లించి కొనుగోళ్లు చేపట్టారు.

గంజాయి కేసులో ఇద్దరి అరెస్టు

హుజూరాబాద్, ఫిబ్రవరి 1: హుజూరాబాద్ ప్రాంతంలో గంజాయి సరఫరా చేస్తున్న ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు టౌన్ సీఐ బొల్లం రమేష్ గురువారం తెలిపారు. గత 15రోజులుగా హుజూరాబాద్, జమ్మికుంట ప్రాంతాల్లో గంజాయి అమ్ముతున్నారనే సమాచారం మేరకు సిర్సపల్లి క్రాస్ రోడ్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా మోటర్ సైకిల్‌పై వచ్చిన ముగ్గురు పోలీసులను చూసి పారిపోతుండగా పట్టుకున్నామన్నారు. జమ్మికుంటకు చెందిన గండికోట గనీ, రాములపల్లికి చెందిన అజయ్‌తో పాటు ఓ బాలుడిని అదుపులో కి తీసుకొని విచారించగా ఆంధ్రప్రదేశ్‌లోని అరుకు నుంచి గంజాయిని హుజూరాబాద్ పట్టణానికి చెందిన దుండగుల వెంకటేష్, పరుశరాములు తీసుకొచ్చి తమకు ఇచ్చారని తెలిపారు. వెంకటేష్, పరుశరాములు పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. ముగ్గురి వద్ద నుంచి 560గ్రాముల ఎండు గంజాయిని, మోటర్ సైకిల్‌ను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఆయన తెలిపారు.

భారత్‌కు 31 సాయుధ డ్రోన్లు

వాషింగ్టన్, ఫిబ్రవరి1: వాస్తవాధీన రేఖ వెంబడి చైనాకు చెక్ పెట్టేందుకు.. హిందూ మహాసముద్రంలో పట్టు పెంచుకునేందుకు ఇండియాకు ఎంతగానో ఉపయోగపడే ఎమ్‌క్యూ-9బి ప్రిడేటర్ డ్రోన్లను విక్రయించడానికి అమెరికా ప్రభుత్వం గురువారం ఆమోదం తెలిపింది. ఈ డీల్ కింద 3.99 బిలియన్ డాలర్ల (సుమారు రూ.33వేల కోట్లు) విలువైన 31 డ్రోన్లను అమెరికా సరఫరా చేయనుంది. ఎమ్‌క్యూ-9బి రిమోట్లీ పైలెటెడ్ ఎయిర్‌క్రాఫ్ట్‌గా పిలిచే ఈ సాయుధ డ్రోన్ల కొనుగోలుపై గత జూన్‌లో ప్రధాని మోదీ అమెరికాలో పర్యటన సందర్భంగా ఇరు దేశాల మధ్య అంగీకారం కుదిరింది. ఇందుకు అవసరమైన అనుమతి మంజూరు చేస్తూ అమెరికా కాంగ్రెస్ సర్టిఫికెట్ ఇచ్చిందని డిఫెన్స్ సెక్యూరిటీ కో-ఆపరేషన్ ఏజెన్సీ తాజాగా తెలిపింది. అమెరికా-భారత్ మధ్య వ్యూహాత్మక సంబంధాల బలోపేతంలో భాగంగా ఈ మెగా డ్రోన్‌డీల్ జరిగిందని పేర్కొంది. భారత్ భద్రతను పెంచేందుకు, ఇండో-పసిఫిక్, దక్షిణాసియా ప్రాంతంలో సుస్థిర, శాంతి, ఆర్థిక ప్రగతిని పెంపొందించేందుకు ఇది ఉపకరిస్తుందని తెలిపింది. మానవరహిత నిఘా విషయంలో భారత్ సామర్థ్యాలు మరింత బలోపేతమవుతాయని అభిప్రాయపడింది. సైన్యం ఆధునికీకరణకు భారత్ కట్టుబడి ఉందని, అందువల్ల వీటిని అందజేయడంలో తమకు ఇబ్బందేమీ లేదని పేర్కొంది. వీటిని హై ఆల్టిట్యూడ్ లాంగ్ ఎండ్యూరెన్స్ (హెచ్ఏఎల్ఈ-హేల్)యూఏవీలుగా వ్యవహరిస్తారు. ఈ 31లో 15 డ్రోన్లను సీగార్డియన్ల పేరుతో నేవీకి ఇస్తారు. స్కై గార్డియన్ పేరుతో ఎయిర్‌ఫోర్స్‌కు 8డ్రోన్లు, ల్యాండ్ వర్షన్ పేరుతో ఆర్మీకి మిగతా 8కేటాయిస్తారు. ఖలిస్థాన్ ఉగ్రవాది గురుప్రీత్ సింగ్ పన్నున్ హత్యకు భారత్ కుట్రపన్నుతున్నందున డ్రోన్లఅమ్మకాల ఒప్పందాన్ని అమెరికా నిలిపివేస్తుందంటూ వార్తలువచ్చిన నేపథ్యంలో కాంగ్రెస్ ఆమోదం లభించింది.

వీసా ఫీజులు భారీగా పెంచిన అమెరికా

వాషింగ్టన్, ఫిబ్రవరి1: అమెరికాకు వచ్చే విదేశీయుల నుంచి వసూలు చేసే నాన్-ఇమిగ్రెంట్ వీసా ఫీజులను బైడెన్ ప్రభుత్వం బుధవారం భారీగా పెంచింది. వీసా ఫీజులను పెంచడం 2016 తర్వాత ఇదే ప్రథమం. ఏప్రిల్1 నుంచి ఇవి అమల్లోకి వస్తాయి. భారతీయులకు అత్యంత ఉపయోగకరంగాఉండే హెచ్-1బీ, ఎల్-1, ఈబీ-5 వీసాల రుసుములు గణనీయంగా పెరిగాయి. విదేశాల వృత్తి నిపుణులు అమెరికాలో ఉద్యోగాలు చేయడానికి హెచ్-1బీ వీసాలు ఇస్తారు. ఇందుకు ఉద్దేశించిన ఫారం 1-129 ఫీజు 460డాలర్ల (రూ.38,150)నుంచి 780డాలర్ల (రూ.64,690)కు పెరిగింది. హెచ్-1బీ వీసాల రిజిస్ట్రేషన్ రుసుము 10 డాలర్ల నుంచి 215 డాలర్ల (రూ.17,830)కు పెంచారు. ఈ నిర్ణయం వచ్చే ఏడాది నుంచి అమల్లోకి వస్తుంది. బహుళజాతి కంపెనీ ఉద్యోగుల బదిలీకి ఉద్దేశించిన ఎల్-1 వీసాల రుసుములు 460డాలర్ల నుంచి 1,385 డాలర్ల (రూ.1,14,860)కు పెరిగాయి. అమెరికా పౌరులకు ఉద్యోగాలిచ్చే వారికి ఈబీ-5 వీసాలు మంజూరు చేస్తారు. వీటి రుసుములు 3,675డాలర్ల నుంచి 11,160 డాలర్ల (రూ.9,25,510)కు పెరిగాయి. మరికొన్ని రకాల వీసాల ఫీజులు స్వల్పంగా తగ్గాయి.

కాంగ్రెస్ వలలో పడొద్దు



(మొదటి పేజీ తరువాయి)

చేయకండి. సీఎంను కలవాలనుకుంటే సమాచారం ఇచ్చి వెళ్లండి' అని సున్నితంగా హెచ్చరించినట్లు సమాచారం. "కాంగ్రెస్ ప్రభుత్వం చాలా సవాళ్లను ఎదుర్కొనాల్సి ఉంది. రాష్ట్ర ఆదాయం అంతంతమాత్రంగా ఉంది. కనీసం అంచనా వేయకుండానే ఇబ్బడిముబ్బడి హామీలిచ్చారు. అమలు చేయలేక ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం ఉంటుందా? ఉండదా? అనేది వారి చేతుల్లోనే ఉంది. ప్రతిపక్షంగా సమర్థంగా వ్యవహరిద్దాం. ఏడాది లోపే ప్రజలకు అసలు విషయం తెలుస్తుంది. మనం తొందరపడాల్సిన పనిలేదు. సంయమనం పాటిద్దాం. చక్కగా నిలబడితే చాలు.. వచ్చే ప్రభుత్వం మనదే"నని కేసీఆర్ పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలించామని.. ఓడిపోయినంత మాత్రాన నిరుత్సాహం, భయడాల్సిన అవసరం లేదన్నారు. కృష్ణా ప్రాజెక్టులను కృష్ణా బోర్డుకు అప్పగించే అంశంపై పార్లమెంటులో నిరసన తెలపాలని ఎంపీలకు సూచించారు. కేంద్ర జల శక్తి శాఖ మంత్రినీ కలవాలని నిర్దేశించారు. లోక్‌సభ ఎన్నికల్లో గట్టిగా పోరాడదామని.. అందరితో చర్చించి, మంచి అభ్యర్థులను ప్రకటిస్తామని తెలిపారు.

అసాధ్యమని ఆర్బీఐనే చెప్పింది

రూ.36 వేల కోట్ల రైతు రుణమాఫీ అసాధ్యమని, ఏక మొత్తంలో ఇన్ని కోట్లు మాఫీ వీలుకాదని ఆర్బీఐ తెలిపిందని పార్టీ నేతల వద్ద కేసీఆర్ వ్యాఖ్యానించారు. అయినా.. ఏపీలో చెల్లించారు. తెలంగాణలోనూ రుణమాఫీ చేస్తామంటూ సీఎం రేవంత్‌రెడ్డి రైతాంగాన్ని తప్పుదారి పట్టిస్తున్నారని ఆరోపించారు. "మనం అధికారంలో ఉన్నప్పుడే కేంద్ర ప్రభుత్వం ఏమీ చేయలేదు. కాంగ్రెస్ ఉంటే చేస్తుందా? వాళ్లకూ చేయదు. శుక్రవారం తెలంగాణ భవన్‌కు వస్తా. బడ్జెట్ సమావేశాల్లో పాల్గొంటా" అని కేసీఆర్ తెలిపారు. కాగా, బడ్జెట్ సమావేశాల్లో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అనుసరించాల్సిన తీరుపై అంశాల వారీగా చర్చించారు. కేటీఆర్, పోచారం, హరీశ్‌రావు, తలసాని, ప్రశాంత్‌రెడ్డి, మల్లారెడ్డి, జగదీశ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేగా ప్రమాణం

గజ్వేల్ ఎమ్మెల్యేగా కేసీఆర్ గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. శాసనసభ స్పీకర్ గడ్డ ప్రసాద్ తన చాంబర్‌లో మధ్యాహ్నం 12.45 గంటలకు ఆయనతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, పోచారం, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్య నేతలు పాల్గొన్నారు. అనంతరం అసెంబ్లీ ఆవరణలోని ప్రతిపక్ష నేత చాంబర్‌లో కేసీఆర్ ప్రత్యేక పూజలు చేసి బీఆర్ఎస్ శాసనసభాపక్ష నేతగా బాధ్యతలు చేపట్టారు. కాగా, ఈ కార్యక్రమాలకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కొత్త ప్రభాకర్‌రెడ్డి, చింతా ప్రభాకర్, కాలె యాదయ్య, పద్మారావుగౌడ్ హాజరు కాలేదని సమాచారం.

రేవంత్ నేను పాత మిత్రులం!

త్వరలోనే రేవంత్‌ను కలుస్తా: మల్లారెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): "నేను రేవంత్‌రెడ్డి పాత మిత్రులం. టీడీపీలో కలిసి పనిచేశాం. ఇప్పుడు ఆయన రాష్ట్ర సీఎం. ఆయనను కలిస్తే తప్పేంటి" అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. రేవంత్‌ను త్వరలోనే కలుస్తానని చెప్పారు. కీసర ఆలయంలో నిర్వహించబోయే పూజా కార్యక్రమాలకు ఆహ్వానిస్తానని తెలిపారు. గురువారం అసెంబ్లీ ప్రాంగణంలో మల్లారెడ్డి మీడియాతో మాట్లాడారు. మల్కాజిగిరి ఎంపీ స్థానంలో పోటీ చేయాలని బీఆర్ఎస్ అధిష్ఠానం తనను కోరుతోందని చెప్పారు. అయితే, తన కుమారునికి అవకాశం కల్పించాలని అధిష్ఠానానికి విజ్ఞప్తి చేశానన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తాను పోటీ చేయబోనని చెప్పారు. అయితే, "రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఆ పార్టీ వాళ్లకు షాక్.. అధికారం కోల్పోవడం మాకు షాక్" అని మల్లారెడ్డి వ్యాఖ్యానించారు. కాగా, హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ వ్యాపారం నెమ్మదించిందన్న మల్లారెడ్డి.. త్వరలో గోవాలో రియల్ వ్యాపారం చేస్తానని చెప్పారు. ఇప్పటికే గోవాలో ఓ హోటల్ కొన్నట్లు తెలిపారు.

పాత.. కొత్త స్పీకర్ల కలయిక!



బాన్సువాడ టౌన్, ఫిబ్రవరి 1: ప్రత్యేక తెలంగాణ ఏర్పడ్డాక రాష్ట్రంలో అసెంబ్లీ స్పీకర్లుగా పనిచేసిన, చేస్తున్న ముగ్గురు ఒకచోట కలిశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం తరపున అసెంబ్లీ స్పీకర్‌గా 2014-19 వరకు మధుసూదనా చారి, 2019-23 వరకు పోచారం శ్రీనివాస్‌రెడ్డి కొనసాగారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం తరపున 2023 డిసెంబరు నుంచి గడ్డం ప్రసాద్.. స్పీకర్‌గా కొనసాగుతున్నారు. గురువారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యేగా కేసీఆర్ ప్రమాణ స్వీకారం సందర్భంగా వారు ముగ్గురు కలిశారు. ఈ సందర్భంగా ముగ్గురూ కలిసి ఫొటో దిగారు.

టచ్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు.. హైకమాండ్ వద్దనడంతో ఆగాం

- ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీ

కామారెడ్డి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): "బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు చాలా మంది కాంగ్రెస్‌తో టచ్‌లో ఉన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని పలువురు ఎమ్మెల్యేలు కలవడమే ఇందుకు నిదర్శనం. వారంతా కాంగ్రెస్‌లో చేరే అవకాశాలున్నాయి. అయితే.. హైకమాండ్ ఇప్పుడప్పుడే పార్టీ ఫిరాయింపులు వద్దని చెప్పింది. అందుకే.. ఫిరాయింపులను ప్రోత్సహించడంలేదు" అని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ వ్యాఖ్యానించారు. గురువారం ఆయన కామారెడ్డిలో జరిగిన ఉచిత వైద్య శిబిరంలో పాల్గొని ప్రసంగించారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఒక్క సీటు కూడా గెలవదన్నారు. కేటీఆర్ అహంకారపూరితంగా మాట్లాడుతున్నారంటూ షబ్బీర్ అలీ మండిపడ్డారు. "రాష్ట్ర ప్రజలు బీఆర్ఎస్‌ను ఛీ కొట్టినప్పటికీ కేటీఆర్ అహంకారం తగ్గడంలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలు కాకముందే సర్కారును కూల్చేస్తామని, త్వరలోనే ప్రభుత్వం పడిపోతుందంటూ కేటీఆర్ అహంకారపూరిత మాటలు మాట్లాడుతున్నారు. ప్రభుత్వాన్ని ఎలా కూలుస్తారో చూస్తాం" అని సవాల్ విసిరారు. పదేళ్లుగా రాష్ట్రాన్ని బీఆర్ఎస్ లూటీ చేసిందని ఆరోపించారు. ఓ అధికారి వద్దే రూ.100 కోట్ల అవినీతి సొమ్ము బయటపడడం బీఆర్ఎస్ పాలనకు నిదర్శనమని ఆయన విమర్శించారు.

ఎంపీ టికెట్ ఆశావహులతో గాంధీభవన్‌లో సందడి

కాంగ్రెస్ టికెట్ కోసం 41 మంది దరఖాస్తులు

హైదరాబాద్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ నుంచి లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసేందుకు దరఖాస్తులు సమర్పించడానికి వచ్చిన ఆశావహులు, వారి అనుచరులతో గాంధీభవన్‌లో గురువారం సందడి నెలకొంది. పార్టీ తరఫున తమకు టికెట్ కేటాయించాలని కోరుతూ 41 మంది అభ్యర్థులు దరఖాస్తులు ఇచ్చారు. బుధవారం ఏడుగురు దరఖాస్తు చేసుకోగా గురువారం 34 మంది పార్టీ అభ్యర్థిత్వాన్ని ఆశిస్తూ దరఖాస్తులను సమర్పించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సతీమణి ఖమ్మం పార్లమెంట్ స్థానానికి దరఖాస్తు చేశారు. అదే నియోజకవర్గం నుంచి తనకు అవకాశం కల్పించాలని పార్టీ సీనియర్ నేత వి.హన్మంతరావు దరఖాస్తు సమర్పించారు. భువనగిరి నుంచి చామల కిరణ్ కుమార్ రెడ్డి, నిజామాబాద్ నుంచి ఆకుల లలిత తదితరులు లోక్‌సభ బరిలో నిలిచేందుకు తమకు అవకాశం కల్పించాలని దరఖాస్తులు అందజేశారు. నియోజకవర్గాల వారిగా.. మహబూబాబాద్ 9, నాగర్‌కర్నూల్ 8, వరంగల్ 6, భువనగిరి 6, ఖమ్మం 2, నిజామాబాద్ 3 చొప్పున దరఖాస్తులు అందినట్టు గాంధీభవన్ వర్గాలు పేర్కొన్నాయి.

బడ్జెట్‌లో అందమైన అబద్ధాలు చెప్పారు

- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

హైదరాబాద్, ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి): కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మధ్యంతర బడ్జెట్‌లో అందమైన భాషతో అందమైన అబద్ధాలు చెప్పారని సీపీఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ విమర్శించారు. బడ్జెట్‌లో ఉద్యోగాల ఊసే లేదని, కార్పొరేట్ రంగానికి పెద్దపీట వేశారన్నారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు మొండిచేయి చూపారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు విమర్శించారు. బయ్యారం ఉక్కు పరిశ్రమ ఊసే లేదని, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు నిధులు ప్రకటించలేదన్నారు. విద్యా రంగానికి 10శాతం నిధులు కేటాయించాల్సి ఉన్నా విస్మరించారని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్ అన్నారు. వ్యవసాయాన్ని కార్పొరేట్ కంపెనీలకు ధారాదత్తం చేసేలా బడ్జెట్ ఉందని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ విమర్శించారు.

ఇది భ్రమల బడ్జెట్: తమ్మినేని

కేంద్ర బడ్జెట్‌ను కార్పొరేట్లకు లాభాలు కట్టబెట్టే, ప్రజలను భ్రమల్లో పెట్టే బడ్జెట్ అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం విమర్శించారు. లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రకటించిన బడ్జెట్ ఇది అని పేర్కొన్నారు.

జనాభా వృద్ధి రేటు సవాళ్లపై కమిటీ

- ఉన్నతాధికారులతో ఏర్పాటు చేయనున్న కేంద్రం
- సంతానోత్పత్తి రేటు తగ్గుతోందంటూ నివేదికలు
- తగినంతగా రీ ప్లేస్‌మెంట్ లేదనే ఆందోళనలు..

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: దేశంలో జనాభా వృద్ధి రేటులో ఎదురవుతున్న సవాళ్లపై ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు ఆర్థిక మంత్రి నిర్మల తెలిపారు. సంతానోత్పత్తి రేటు భర్తీ స్థాయుల (రీప్లేస్‌మెంట్ రేట్) కంటే పడిపోయినట్లు గణాంకాలు సూచిస్తుండడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. దేశంలో 2011లో చివరిసారిగా జనాభా లెక్కల సేకరణ చేపట్టారు. 2021లో మళ్లీ గణన నిర్వహించాల్సి ఉన్నప్పటికీ కొవిడ్ నేపథ్యంలో వాయిదా వేశారు. ఈ క్రమంలో జనాభాపై సాధికార లెక్కలు లేవు. వృద్ధి రేటు 2.1 నుంచి 2కి తగ్గిందంటూ 2020 నాటి శాంపిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్ (ఎస్ఆర్ఎస్), 2.2 నుంచి 2కు పడిపోయిందంటూ నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే (ఎన్ఎఫ్‌హెచ్ఎస్) పేర్కొన్నాయి. దీనికి పరిష్కార మార్గాలను కమిటీ సూచించనుంది. జనాభా వేగవంతమైన వృద్ధి, మార్పుల నుంచి ఉత్పన్నమయ్యే సవాళ్లను పరిశీలించనుంది.

గోదావరి ఎక్స్‌ప్రెస్‌కు యాభైఏళ్లు

- భాగ్యనగరం నుంచి వాల్తేరుకు మొదటి రైలు ఇదే
- 1974 ఫిబ్రవరి 1న ప్రారంభమైన ఎక్స్‌ప్రెస్



సికింద్రాబాద్/హైదరాబాద్ సిటీ, విశాఖపట్నం, రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): గోదావరి ఎక్స్‌ప్రెస్.. ఏపీలోని ఉభయ గోదావరి జిల్లాలతోపాటు ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన రైలు ప్రయాణికులకు అత్యంత ప్రతిష్ఠాత్మకమైన రైలు. గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో బెర్త్ దొరికిందంటే.. బంగారం బిస్కెట్ దొరికినంతగా విశాఖ ప్రాంతవాసులు ఆనందపడతారంటే అతిశయోక్తికాదు. 1974 ఫిబ్రవరి 1న హైదరాబాద్-విశాఖపట్నం మధ్య ప్రారంభమైన మొట్టమొదటి రైలు ఇది. అంటే ఈ రైలు ప్రవేశపెట్టి గురువారానికి సరిగ్గా యాభై ఏళ్లు పూర్తయ్యాయి. గోదావరి ఎక్స్‌ప్రెస్ రైలు ప్రస్తుతం హైదరాబాద్(నాంపల్లి) స్టేషన్ నుంచి సాయంత్రం 5.05గంటలకు బయల్దేరి సికింద్రాబాద్, విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట, అనకాపల్లి మీదుగా.. విశాఖపట్నానికి చేరుకుంటుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉద్దండులైన ప్రజాప్రతినిధులకు, ఉన్నతాధికారులకు ఇది ఎంతో ముఖ్యమైన రైలుగా ఉండేది. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు రావాలన్నా, ఇక్కడ్నుంచి స్వస్థలాలకు వెళ్లాలన్నా ఈ రైలులో వెళ్లడాన్ని సౌకర్యవంతంగా భావిస్తారు. రాష్ట్రం విడిపోయిన తర్వాత ప్రజాప్రతినిధులు, అధికారుల తాకిడి కొంత తగ్గినా.. సాధారణ ప్రయాణికుల నుంచి ఆదరణ ఏమాత్రం తగ్గలేదు. దక్షిణ మధ్యరైల్వే ఆధ్వర్యంలో నడుస్తున్న గోదావరి ఎక్స్‌ప్రెస్ రైలు మొత్తం 18స్టేషన్లలో ఆగుతుంది. 24 బోగీలతో అతిపొడవైన రైలుగా పేరుగాంచిన ఈ ఎక్స్‌ప్రెస్ 710 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తుంది. గురువారం సాయంత్రం గోదావరి ఎక్స్‌ప్రెస్‌కు రైల్ ఫ్యాన్స్ అసోసియేషన్ ప్రతినిధులు నాంపల్లి స్టేషన్‌లో ఘనంగా పుట్టిన రోజు వేడుకలు నిర్వహించడం విశేషం. దక్షిణ మధ్య రైల్వే కూడా ఈ ఎక్స్‌ప్రెస్‌ను సర్వాంగ సుందరంగా అలంకరించింది. ఈ రైలు ఆగే అన్ని స్టేషన్లలో వేడుకలు జరిపారు. 1990లోనే 24 కోచ్‌లతో అతి పెద్ద రైలుగా పేరొందిన గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో 2000 సంవత్సరం నుంచి ఫస్ట్‌క్లాస్ ఏసీ సేవలు అందుబాటులోకి వచ్చాయి. 1993 నుంచే థర్డ్ ఏసీ కోచ్‌లున్న ఈ రైలు.. దక్షిణ మధ్య రైల్వేలోనే మొదటి ఏసీ కోచ్ ఉన్న ఎక్స్‌ప్రెస్‌గా పేరుగాంచింది. ఈ ఎక్స్‌ప్రెస్‌ను నేరుగా దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ పర్యవేక్షిస్తారంటే దానికి ఉన్న ప్రాముఖ్యత చెప్పనక్కర్లేదు. రైలు నిర్వహణ నుంచి సమయపాలన, పరిశుభ్రత, ఆహార నాణ్యత, ఫిర్యాదులు, ఇతర ఆపరేషన్స్ అన్నీ ప్రతిరోజూ జీఎం టేబుల్ మీద ఉండాల్సిందేనని చెబుతుంటారు.

74 టీఎంసీలు కేటాయించాలి!

గోదావరి-కావేరి అనుసంధానంపై కేంద్రాన్ని డిమాండ్ చేసిన తెలంగాణ

హైదరాబాద్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): గోదావరి-కావేరి అనుసంధానంలో తరలించే 148 టీఎంసీల జలాల్లో 74 టీఎంసీలను తమకు కేటాయించాలని తెలంగాణ కోరింది. నదుల అనుసంధానంలో తెలంగాణకు 45 టీఎంసీలు కేటాయించాలని ప్రతిపాదించారని, అవి సరిపోవని తెలిపింది. పూర్వ నల్లగొండ, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో పలు ప్రాంతాలకు సాగునీటిని అందించాల్సి ఉన్నందున, 74 టీఎంసీలు ఇవ్వాలని విజ్ఞప్తి చేసింది. గోదావరి-కావేరి అనుసంధానంపైతెలంగాణ లేవనెత్తిన అంశాలపై చర్చించడానికి వీలుగా గురువారం జలసౌధలో జాతీయ నీటి అభివృద్ధి సంస్థ (ఎన్‌డబ్ల్యూడీఏ) హైదరాబాద్ విభాగం చీఫ్ ఇంజనీర్ దేవేందర్ అధ్యక్షతన సమావేశం జరిగింది. దీనికి తెలంగాణ నుంచి ఈఎన్‌సీ బి.నాగేంద్రరావు, అంతరాష్ట్ర విభాగం చీఫ్ ఇంజనీర్ మోహన్‌కుమార్ తదితరులు హాజరయ్యారు. గోదావరి-కావేరి అనుసంధానంతో వివిధ అంశాలపై రాష్ట్ర అధికారులు తమ అభిప్రాయాలను వెలిబుచ్చారు. కాగా తెలంగాణ అభ్యంతరాలపై మళ్లీ సమావేశం ఉంటుందని ఎన్‌డబ్ల్యూడీఏ స్పష్టం చేసింది. అనుమానాలన్నీ నివృత్తి చేశాకే నదుల అనుసంధానంలో ముందుకెళతామని తెలిపింది.

నేటి నుంచి పంచాయతీల్లో 'ప్రత్యేక' పాలన

హైదరాబాద్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): గ్రామ సర్పంచుల పదవీకాలం ముగిసిన నేపథ్యంలో శుక్రవారం నుంచి పంచాయతీలకు ప్రత్యేక అధికారులు బాధ్యత వహించనున్నారు. ఈ మేరకు గ్రామ ప్రత్యేకాధికారుల నియామకం, బాధ్యతల స్వీకరణ, విధి విధానాలను సూచిస్తూ.. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా ఉత్తర్వులు జారీ చేశారు. ఎంపీడీఓ, తహశీల్దారు, ఎంపీఓ, డీటీ, ఆర్ఐ, ఇంజినీర్లు, ఎంఈవోలు, ఇతర గెజిటెడ్ స్థాయి అధికారులను గ్రామ ప్రత్యేక అధికారులుగా నియమించారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా లేకపోవడంతో పదేళ్ల తర్వాత మళ్లీ గ్రామాల్లో ప్రత్యేక పాలన ప్రారంభం కానుంది. రాష్ట్రంలోని 12,769 గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించడంతో గురువారం సర్పంచుల వద్ద ఉన్న డిజిటల్ కీలు, చెక్కులు, ఇతర రికార్డులన్నీ సీజ్ చేయాలని గ్రామ పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశారు.

నేడు ఈజీఎస్ ఉద్యోగులకు పే స్కేల్ ప్రకటన..?

హైదరాబాద్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): 'గత ప్రభుత్వం పే స్కేల్ ప్రకటిస్తామని హామీ ఇచ్చింది.. అది అమలుకు నోచుకోలేదు.. కొత్త ప్రభుత్వం మా ఆశలు నెరవేరుస్తుందని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనిచేస్తున్న ఉద్యోగులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. తమకు ఇచ్చిన హామీ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి నేడు(శుక్రవారం) ఇంద్రవెల్లి సభలో తమ పే స్కేల్ ప్రకటిస్తారని, సంబురాలు జరుపుకొనేందుకు ముందస్తు ఏర్పాట్లు చేసుకున్నామని ఈజీఎస్ ఉద్యోగులు ఒక ప్రకటనలో తెలిపారు.

కోర్టు ఆదేశాలిచ్చిన గంటల్లోనే జ్ఞానవాపీ సెల్లార్‌లో పూజలు

- హైకోర్టులో అప్పీలు చేసిన మసీదు కమిటీ

వారాణసి, ఫిబ్రవరి 1: జ్ఞాన్‌వాపీ మసీదు సెల్లార్‌లోని 'వ్యాస్ కీ టెఖానా'లో ఉన్న హిందూ దేవత విగ్రహాలకు పూజలు చేసుకోవచ్చంటూ జిల్లా కోర్టు ఆదేశాలు ఇచ్చిన కొద్ది గంటల్లోనే అక్కడ ప్రార్థనలు ప్రారంభమయ్యాయి. బుధవారం రాత్రి 10.30 గంటల సమయంలో పూజలు చేసి లక్ష్మీదేవి, వినాయకులకు హారతి ఇచ్చారు. 31 సంవత్సరాల అనంతరం వ్యాస్‌జీ కా టెఖానాను పూజల కోసం తెరిచారని కాశీ విశ్వనాథ మందిర ట్రస్టు అధ్యక్షుడు నాగేంద్ర పాండే తెలిపారు. కాగా, తమకు అప్పీలు వంటి న్యాయ ప్రక్రియకు కూడా అవకాశం ఇవ్వకుండా హిందువులు పూజలు చేసుకోవడానికి అనుమతి ఇవ్వడం తగదని పేర్కొంటూ మసీదు కమిటీ గురువారం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. అయితే తొలుత హైకోర్టులో పిటిషన్ వేయాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ చెప్పడంతో దాన్ని అమలు చేసింది. అలహాబాద్ హైకోర్టులో పిటిషన్ సమర్పించి అత్యవసరంగా విచారణ జరపాలని కోరింది.

హేమంత్ సోరెన్‌కు ఒక రోజు కస్టడీ

- 10 రోజుల పాటు ఇవ్వాలన్న ఈడీ వినతిపై నేడు తీర్పు
- రాంచీలో 8.5 ఎకరాలు ఆక్రమించినట్టు కేసు నమోదు

రాంచీ, ఫిబ్రవరి 1: మనీలాండరింగ్ కేసులో అరెస్టయిన ఝార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌ను గురువారం ఇక్కడి పీఎంఎల్ఏ ప్రత్యేక కోర్టు ఒక రోజు జ్యుడీషియల్ కస్టడీకి పంపించింది. పోలీసులు ఆయనను ఇక్కడి బీర్సా ముండా సెంట్రల్ జైలుకు తరలించారు. ఆయనను పది రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలన్న వినతిపై కోర్టు శుక్రవారం తీర్పు వెలువరించనుంది. ఈడీ బుధవారం ఆయనను ఏడు గంటల పాటు విచారించింది. అనంతరం ఆయన ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయగా రాత్రి పది గంటల సమయంలో గవర్నర్ హౌస్ వద్ద అరెస్టు చేసింది. కాగా, రాత్రి సమయంలో గవర్నర్ హౌస్ ఆవరణలోనే అరెస్టు చేయడాన్ని సవాలు చేస్తూ గురువారం సోరెన్ లాయర్లు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. విచారణ సమయంలో ఆయన ధరించిన మతమపరమైన లాకెట్, రింగ్‌లను తీసివేయాలని ఈడీ అధికారులు కోరగా అందుకు ఆయన నిరాకరించారు. రాంచీలో సోరెన్ 12 చోట్ల 8.5 ఎకరాల విస్తీర్ణంగల స్థలాలను అక్రమంగా కలిగి ఉన్నారంటూ ఈడీ కేసుపెట్టింది. ఈ వ్యవహారంలో నగదు అక్రమ నగదు చలామణి జరిగినట్టు ఆరోపించింది. తొలుత భూమి రికార్డుల నకిలీ పత్రాలను తయారు చేస్తున్నారంటూ రెవెన్యూ శాఖ సబ్ ఇన్‌స్పెక్టర్ భాను ప్రతాప్ ప్రసాద్‌పై కేసు నమోదయింది. ఆయన వద్ద 11 ట్రంకు పెట్టెల్లో ఒరిజినల్, నకిలీ దస్తావేజులు, 17 ఒరిజినల్ రిజిస్టర్లు లభించాయి. దీనిపై జరిగిన విచారణలో ఇందులో సోరెన్‌కు సంబంధం ఉందంటూ ప్రసాద్ ఫోన్‌లో లభించిన సమాచారం ఆధారంగా ఈడీ కేసు నమోదు చేసింది. వాంగ్మూలం నమోదు చేయడానికని పిలిచి ఎలా అరెస్టు చేస్తారని సోరెన్ తరఫున హాజరైన అడ్వకేట్ జనరల్ రాజీవ్ రంజన్ ప్రశ్నించారు. ఇది ప్రభుత్వాన్ని కూలగొట్టడానికి జరిగిన కుట్ర అని ఆరోపించారు.



జేఎంఎం కూటమి ఎమ్మెల్యేలను తరలించడానికి బేగంపేట విమానాశ్రయం వద్ద సిద్ధంగా ఉన్న బస్సులు

ముఖ్యమంత్రిగా ప్రమాణం చేయండి

(మొదటి పేజీ తరువాయి)

చంపయి సోరెన్ గవర్నర్ రాధాకృష్ణన్‌ను కలిశారు. హేమంత్ సోరెన్ రాజీనామా చేసిన అనంతరం రాష్ట్రానికి కొత్త సీఎం లేకపోవడంతో గందరగోళ పరిస్థితులు నెలకొని ఉన్నాయని తెలిపారు. ముఖ్యమంత్రి లేకపోవడంతో రాజకీయ సంక్షోభం ముదిరిపోయే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామన్న తమ విజ్ఞప్తిని అంగీకరించాలని కోరారు. కాగా, చంపయి సోరెన్‌ను ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించడంలో గవర్నర్ ఆలస్యం చేయడంతో.. జేఎంఎం-కాంగ్రెస్ కూటమి ఎమ్మెల్యేలను హైదరాబాద్ తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. గురువారం రెండు చార్టర్డ్ విమానాలను సిద్ధం చేయగా.. సాయంత్రం 6.30 గంటల సమయంలో పొగమంచు ఎక్కువగా ఉండడంతో వాటిని రద్దు చేశారు. 81 మంది సభ్యులున్న ఝార్ఖండ్ అసెంబ్లీలో జేఎంఎం కూటమికి 43 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. ఇక మనీలాండరింగ్ కేసులో ఈడీ తనను అరెస్టు చేయడాన్ని సవాలు చేస్తూ మాజీ సీఎం హేమంత్ సోరెన్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆయన పిటిషన్‌ను విచారించేందుకు సీజేఐ ముగ్గురు న్యాయమూర్తులతో ప్రత్యేక ధర్మాసనాన్ని ఏర్పాటు చేశారు. సోరెన్ పిటిషన్‌పై శుక్రవారం విచారణ జరపనున్నారు.

కేసీఆర్‌ను కలిసిన కోరుట్ల ఎమ్మెల్యే



మాజీ సీఎం కేసీఆర్‌తో కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్

మెట్‌పల్లి, జనవరి 1: గజ్వేల్ ఎమ్మెల్యేగా మాజీ సీఎం కేసీఆర్ గురువారం ప్రమాణస్వీకార కార్యక్రమంలో కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డితో కలిసి మాజీ సీఎంను మర్యాదపూర్వకంగా కలిసి శుభకాంక్షలు తెలిపారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధిక స్థానాలను గెలిచేందుకు అనుసరించాల్సిన వ్యూహాలు, కార్యాచరణ గురించి పార్టీ నేతలకు కేసీఆర్ దిశానిర్దేశం చేశారని ఎమ్మెల్యే సంజయ్ తెలిపారు. త్వరలో జరగనున్న రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో అనుసరించాల్సిన కార్యాచరణ గురించి సూచనలు చేశారన్నారు.

భావితరాలకు సంప్రదాయాలను తెలపాలి

● సరస్వతి పీఠాధిపతి శ్రీ మాధవా నందస్వామి

మెట్‌పల్లి, ఫిబ్రవరి, 1 : భావి తరాలకు హిందూ సంప్రదాయాలు, ఆధ్యాత్మికత గురించి తెలిపే విధంగా విలువలు ఉండాలని సర్వసతి పీఠాధిపతి శ్రీ మాధవానందస్వామి అన్నారు. బుధవారం పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయంలోని గర్భగుడిలోని దేవుని ప్రతిమకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా పునర్నిర్మాణం చేపట్టాలని నిర్వహకులకు సూచించారు. ఆలయం నిర్మాణం భావితరాలకు సంప్రదాయాలను తెలిపే విధంగా చేపట్టాలని సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం పట్టణాధ్యక్షుడు మైలారపు రాంబాబు, ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శి మైలారపు లింబాద్రి, మాజీ అధ్యక్షుడు మహాజన్ నర్సింలు, దొంతుల రాజు, కోట సుమాన్, పుల్లూరి నవీన్, కోట కిరణ్, చాడ సురేష్, బండారి సదాశివకుమార్, చీలమంతుల శివకుమార్, పాంపట్టి అరుణ్‌కుమార్, పురోహితులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు తెలుసుకోవాలి



బహుమతి అందిస్తున్న మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రంజిత్

మెట్‌పల్లి, ఫిబ్రవరి, 1: విద్యార్థి దశ నుంచి ట్రాఫిక్ నిబంధనలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని మెటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ రంజిత్ కుమార్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు-2024లో భాగంగా గురువారం పట్టణంలోని బ్రూక్లిన్ గ్రామర్ పాఠశాలలోని విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఆయన బహుమతులు అందజేశారు.పాఠశాలకు వచ్చిన మెటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ రంజిత్‌కుమార్‌ను ప్రిన్సిపాల్ బూర ప్రసాద్‌గౌడ్, పాఠశాల యూనియన్ అధ్యక్షుడు వెంకట రామారావు శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాసంస్థలు 60 సంవత్సరాలు నిండని వారిని స్కూల్‌బస్ డ్రైవర్‌గా నియమించాలని, పరిమితికి మించి విద్యార్థులతో బస్సులో ప్రయాణం చేయరాదని, బస్సుల్లో అటెండర్‌ను ఉంచాలన్నారు. మద్యం సేవించి, పాటలు వింటూ వాహనం నడపకూడదన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ బూర ప్రసాద్‌గౌడ్, పాఠశాల యూనియన్ అధ్యక్షుడు వెంకట రామారావు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా బీఆర్‌ఎస్ ప్రమాద బీమా

● ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

బీర్‌పూర్,ఫిబ్రవరి 1: కార్యకర్తలకు అండగా బీఆర్‌ఎస్ పార్టీ ప్రమాద బీమా ఉందని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. గురువారం బీర్‌పూర్ మండలంలోని తాళ్లధర్మారం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ఏనుగు ఎల్లారెడ్డి ఇటీవల ప్రమాదవశాత్తూ మృతి చెందాడు. గురువారం పెద్దకర్మ కార్యక్రమాన్ని నిర్వహించగా కార్యక్రమంలో పాల్గొని మృతుడు ఎల్లారెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు.కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీ సభ్యత్వం కలిగిన వ్యక్తి ప్రమాదవశాత్తు మరణిస్తే బీఆర్‌ఎస్ పార్టీ అండగా నిలుస్తుందని, ఇటు ప్రభుత్వం సైతం రైతు బీమా ద్వారా భరోసా కల్పిస్తోందన్నారు. రైతు ఏ కారణంతో మరణించినా ఎలాంటి పైరవీలు లేకుండా 5లక్షలు బీమా సొమ్ము వారి ఖాతాల్లో జమ అవుతుందని అన్నారు. అనంతరం జగిత్యాలలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కొల్వాయి మాజీ సర్పంచ్ రంగు సులోచనను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని గూర్చి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కొల్ముల రమణ, నారపాక రమేష్, నల్ల మహిపాల్ రెడ్డి, శేఖర్ రెడ్డి, అశోక్, గంగారెడ్డి, భుమేష్, మహేష్, ఆనంద్, నవీన్ గంగారెడ్డి ఉన్నారు.

మాజీ ఎమ్మెల్యేపై ఆరోపణలు మానుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

కోరుట్ల, ఫిబ్రవరి 1 : మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావుపై ఆరోపణలు మానుకోవాలని బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిదులు, నాయకులు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. జనవరి 31వ తేదీన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు మాజీ ఎమ్మెల్యేపై చేసిన ఆరోపణలను ఖడిస్తున్నట్లు తెలిపారు. ఎప్పుడు కూడా మాజీ ఎమ్మెల్యే వారి సొంత పనులకు కార్మికులను వినియోగించుకోలేదని అలాంటి తప్పుడు ప్రచారం చేయడం మానుకోవాలని అన్నారు. సమావేశంలో కౌన్సిలర్లు మోర్తాడ్ లక్ష్మీనారాయణ, గందం గంగాధర్, పెర్ల సత్యం, జిందం లక్ష్మీనారాయణ, అహ్మద్, నాయకులు పుప్పాల ప్రభాకర్, బద్ది మురళి, షేక్ ఫహీం, రహీం, బాబాబాయి, మురళి, యాటం కృష్ణలతో పాటు పలువురు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

రాయికల్, ఫిబ్రవరి 1: రాయికల్ పట్టణానికి చెందిన జిన్నా మనోహర్ ఇటీవల అనారోగ్యంతో మరణించగా తోటి స్నేహితులు ఆయన కుటుంబానికి గురువారం ఆర్థిక సహాయం అందించారు. దుబాయ్‌లోని స్నేహితుల సహకారంతో రూ.35,600ల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో స్నేహితులు కిరణ్ కుమార్, బద్రి ధర్మేందర్, రాము, సత్తయ్య పాల్గొన్నారు.

అయోధ్య సైకిల్ యాత్రికులకు సన్మానం

రాయికల్, ఫిబ్రవరి 1: రాయికల్ పట్టణం నుంచి అయోధ్య బాలరాముని దర్శనార్థం సైకిల్‌యాత్ర చేపట్టిన గుండేటి మాధవ్, నల్లూరి వరుణ్ అనే యువకులను పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో స్థానిక ఆంజనేయ స్వామి ఆలయంలో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ నాయకులు మ్యాకల రమేష్, ఎద్దండి దివాకర్‌రెడ్డి, గంగాధర్, బత్తిని భూమయ్య, కడకుంట్ల నరేష్, శ్రీకాంత్, నర్సింహారెడ్డి, ప్రసాద్, మురళి, భూమయ్య ఉన్నారు.

కుష్టు వ్యాధిపై విద్యార్థులకు అవగాహన

మల్యాల, ఫిబ్రవరి 1: కుష్టు వ్యాధి నివారణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మండలంలోని నూకపల్లి మోడల్ స్కూల్ విద్యార్థులకు గురువారం మల్యాల ప్రాథమిక ఆసుపత్రి వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. కుష్టు వ్యాధి నివారణ వారోత్సవాల్లో భాగంగా శరీరంపై స్పర్శ జ్ఞానం లేని రాగి రంగు మచ్చలు ఉంటే అది కుష్టు వ్యాధి ప్రారంభ లక్షణంగా గుర్తించి మొదట్లోనే వైద్యం తీసుకోవాలని తెలిపారు. వైద్యురాలు మౌనిక, ప్రిన్సిపాల్ సరితాదేవి, డీపీఎంవో దేవ్‌సింగ్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇష్టారాజ్యంగా ఇటుక బట్టీల నిర్వహణ

● అనుమతులు లేకుండానే కొనసాగింపు
● కనీస వసతులు కరువు

ఎండపల్లి, ఫిబ్రవరి 1: మండలంలోని కొన్ని ప్రాంతాల్లో ఇటుక బట్టీలు ఇష్టా రాజ్యంగా నిర్వహిస్తున్నారనే ఆరోపణలున్నాయి. కనీస నిబంధనలు పాటించకుం డా వ్యాపారం నడిపిస్తుండటంతో ప్రభుత్వ ఖజానాను కొల్లగొడుతున్నారని విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. సంబంధిత అధికారులు దృష్టి సారించక పోవడంతో నిర్వాహకులు కూడా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. అనుమతులు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా వీటిని దర్జాగా కొనసాగిస్తున్నారు. బట్టీల నిర్వహణకు మట్టి, నీరు, విద్యుత్తును అక్రమంగా వినియోగిస్తూ ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నారు. నిబంధనల ప్రకారం సంబంధిత పంచాయతీ, గనులు, విద్యుత్తు శాఖల నుంచి అనుమతులు తీసుకుని బట్టీలు నిర్వహించాలి. ఇవేవి లేకుండానే కొనసాగిస్తున్నారు. కార్మికులకు లేబర్ కార్డులు లేకుండానే పనిలో విని యోగించుకుంటున్నారు. ఎండపల్లి మండల కేంద్రంలో గుళ్లకోట, రాజారాంపల్లి గ్రామాలలో ఇటుక బట్టీలను నిర్వహిస్తున్నారు. దీంతో ఆయా ప్రాంతాలలోని పంచాయతీలకు అదనపు ఆదాయ వనరులు లేకుండా పోతున్నాయి. చాలాచోట్ల వీటిని వ్యవసాయ క్షేత్రాలలో వీటిని ఏర్పాటు చేస్తున్నారు. ఇక్కడ ఏర్పాటు చేస్తే తప్పనిసరిగా రెవెన్యూ శాఖ అనుమతులు తీసుకోవాలి. వాస్తవానికి బట్టీలలో భద్రత ప్రమాణాలు పాటిస్తున్నట్లు ధృవపత్రం తీసుకోవాలి. కార్మికులకు బ్యాంకు ఖాతా ద్వారానే జీతాలు ఇవ్వాలి. సెక్యూరిటీ కింద నిధిని కార్మికుల కోసం జమ చేయాలి. ఇటుక బట్టీల స్థలం లీజుకు సంబంధించిన ఒప్పంద పత్రాలు ఉండాలి. బట్టీల వద్ద వసతి, మంచీనీరు, మరుగుదొడ్లు, వంటి కనీస సౌకర్యాలు కల్పించాలి. కానీ ఇవేమీ నిర్వాహకులు పాటించడం లేదని ఆరోపణలున్నాయి.

విద్యుత్ చౌర్యం..

ఇటుక బట్టీల నిర్వహణకు ప్రధానంగా నీరు అవసరం ఉంటోంది. ఇందుకోసం త్రీఫేజ్ విద్యుత్తును వినియోగిస్తున్నారు. ఎవరికి అనుమానం కలగని రీతిలో వ్యవసాయ క్షేత్రాలలోని బోరు బావుల నుంచి కరెంట్ వాడుతున్నారు. కొన్ని బట్టీల వద్ద పేరుకే మీటర్లు తీసుకుని మధ్యాహ్నం త్రీఫేజ్ కరెంట్ ఉన్నప్పుడు ఇటుక బట్టీల దగ్గరలో వాటర్ ట్యాంకులను నిర్మించుకొని అదే నీటిని వాడుతూ ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నారు. అధికారులకు అనుమానాలు రాకుండా నిర్వాహకులు వ్యవహరిస్తున్నారు. తయారు చేసిన ఇటుకలను కాల్చేందుకు కొందరు నిర్వాహకులు నల్లమట్టి, కలపను వాడుతున్నారు. పంట పొలాలలో రైతుల వద్ద నుంచి సేకరించిన కట్టెలను బట్టీల వద్దకు తరలిస్తున్నారు. దీంతో కలప వినియోగం కూడా అధికమవుతోంది.



ఇటుక బట్టీ

కనిపించని వసతులు..

ఇటుక బట్టీల వద్ద చూస్తే వారికి కనీస వసతులు కూడా నిర్వాహకులు కల్పిం చడం లేదు. బట్టీలో 50-200 మంది కార్మికులు పనిచేస్తే కార్మికశాఖ ఉప కమీషనర్ (డీఎసీఎల్) అనుమతులు ఇవ్వాలి. 20-50 మంది కార్మికులుంటే కార్మికశాఖ సహాయ కమీషనర్ (ఏసీఎల్) లైఎన్సులు మంజూరు చేయాలి. 20 మంది లోపు కార్మికులు పనిచేస్తే స్థానిక కార్మికశాఖ అధికారి అనుమతులు పొందాలి. గ్రామానికి దూరంగా ఉన్న బట్టీలకు అనుమతులే లేవు. వారికి వసతులు కల్పించడం నిర్వాహకుల ప్రధాన విధి. స్థానికులతో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన కార్మికులు ఇక్కడ పనిచేస్తూ ఉపాధి పొందుతున్నారు. కార్మికులకు లేబర్ కార్డులు లేకున్నా పని చేపిస్తున్నారు. అంతే కాకుండా ఉన్న కార్మికులకు కనీసం స్నానపు గదులు, మరుగుదొడ్లు కూడా లేకపోవడంతో బహిరంగ ప్రదేశాల్లోనే కాలకృత్యాలు తీర్చుకుంటున్నారు. కొన్ని సందర్భాలలో కూలి డబ్బులు కూడా సకాలంలో అందకపోవడంతో పడుతున్న పాట్లు చెప్పనలవి కాదు. సంబంధిత అధికారులు తరుచూ ఇటుక బట్టీలను సందర్శించాల్సి ఉన్నా ఆవేమీ కానరావడం లేదు. ఇప్పటికైనా మైనింగ్ అధికారులు, కార్మికశాఖ అధికారులు, రెవెన్యూ అధికారులు స్పందించి నిబంధనలకు విరుద్ధంగా ఉన్న బట్టీలపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

తనిఖీలు చేపడుతాం

ఉదయ్‌కుమార్, తహసీల్దార్

నిబంధనలు పాటించకుండా ఇటుక బట్టీలు నిర్వహిస్తున్నట్లు సమాచారం ఉంది. త్వరలో ఆ బట్టీలు సందర్శించి అవి ఎంత వరకు వాస్తవమో తెలుసుకుంటాము. ఇటుక బట్టీల వద్ద కనీస నిబంధనలు పాటించకుంటే చర్యలు తీసుకుంటాము. ఇటుక బట్టీలలో కనీస సౌకర్యాలు కల్పించేలా కృషి చేస్తాం.

డబ్బులు వసూలు చేస్తున్న డీపీవోపై చర్యలు తీసుకోవాలి

బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి



వేంపేటలోని సమావేశంలో మాట్లాడుతున్న అల్లూరి మహేందర్‌రెడ్డి

మెట్‌పల్లి రూరల్, ఫిబ్రవరి, 1 : జిల్లాలోని కార్యదర్శులు, స్పెషల్ ఆఫీసర్స్‌ల బదిలీలపై అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్న డీపీవో దేవరాజ్‌పై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ యాస్మిన్ బాషాను ఫోన్ ద్వారా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి కోరారు. గురువారం మండలంలోని వేంపేట గ్రామం లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సర్పంచుల పదవి కాలం ముగియడంతో ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమిన్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా ప్రత్యేక అధికారులుగా వారు కోరుకున్న గ్రామాలను కేటాయించడానికి, కార్యదర్శుల బదీలీల విషయంలో జూనియర్ అసిస్టెంట్‌ను మధ్యవర్తిగా పెట్టుకోని అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. అదే విధంగా అక్రమ లే అవుట్‌లపై డబ్బులు వసూలు చేయడంతో పాటు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలకు అనుకూలంగా వ్యవహరిస్తూ కార్యకర్తలగా మారిన డీపీవో దేవరాజ్ పై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను ఫోన్ ద్వారా కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచు గోరుమంతుల ప్రవీణ్‌కుమార్, పార్టీ కిసాన్ సెల్ మండలాధ్యక్షుడు పిడుగు తిరుపతిరెడ్డి, నేరెళ్ల చిరంజీవిగౌడ్, నాయకులు పాల్గొన్నారు.

వేతన జీవులకు కేంద్ర బడ్జెట్ నిరాశ

కథలాపూర్, ఫిబ్రవరి 1 : పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం గురువారం ప్రవేశపెట్టిన బడ్జెట్ వేతన జీవులను పూర్తిగా నిరాశ పరిచిందని టీఆర్‌టీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బేతి సాయికృష్ణ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కొత్త పన్ను ల విధానంలో 80సి, 80డి, ఇంటి అద్దె, విద్య, గృహ రుణాలపై వడ్డీ మినహాయింపులు వర్తింప జేయాలని ఉపాధ్యాయ సంఘాలు మొర పెట్టుకున్నా పట్టించుకోలేదని ఆరోపించారు. బడ్జెట్ ప్రతిపాదన లకు సవరణలు చేసి పన్నుల భారం తగ్గించి, ప్రత్యక్ష పన్నుల పరిమితిని రు. 10 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం

కోరుట్ల, ఫిబ్రవరి 1 : క్రీడలలో గెలుపోటములు సహజమని అయ్యప్ప దేవాలయ గౌరవాధ్యక్షుడు, గురుస్వామి చిద్రాల నారాయణ అన్నారు. గురువారం పట్టణంలోని సరస్వతి శిశుమందిరిలో క్రీడలలో ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు బహుమతులను పాఠశాల కరస్పాండెంట్ నీలి శ్రీనివాస్‌తో కలిసి పంపిణీ చేశారు. చిద్రాల నారాయణ మాట్లాడారు. గణతంత్ర దినోత్సవాన్ని గుర్తుంచుకోవడానికి విద్యార్థులకు క్రీడలు నిర్వహించడం అభినందనీయమన్నారు. పాఠశాల నిర్వహకులు గురుస్వామిని శాలు వాలతో సత్కరించారు. ప్రదానోపాధ్యాయుడు గోపు వెంకటేష్, పాఠశాల కార్యదర్శి శంకర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి పరామర్శ

రాయికల్, ఫిబ్రవరి 1: ఆలూరు గ్రామంలో సోమిరెడ్డి మోహన్ రెడ్డి మరణించగా గురువారం ఆయన పార్థివదేహానికి నివాళులు అర్పించి కుటుంబసభ్యులను ఎమ్మెల్సీ టి.జీవన్ రెడ్డి పరామర్శించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల అ. ధ్యక్షుడు రవీందర్‌రావు, కొయ్యడి మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

కొడిమ్యాల, ఫిబ్రవరి 1 : మండలంలోని అప్పారావుపేట గ్రామానికి చెందిన రేండ్ల పద్మ ఇంటిలో బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనం చేశారు. మల్యాల సీఐ దామోదర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు ఇంటి యజమానురాలు పద్మ బుధవారం ఇంటికి తాళం వేసి తీర్థయాత్రలకు వెళ్లింది. ఎదురు ఇంటిలో నివాసం ఉంటున్న పద్మ అత్తమ్మ రేండ్ల ప్రమీల గురువారం తెల్లవారి లేచి చూసే సరికి తలుపులు తెరిచి ఉన్నాయి. దీంతో ఆమె ఇంటి వెనుకకు వెళ్లి చూడగా బీరువా తాళాలు పగుల గొట్టి, వస్తువులు చిందరవందరగా ఉన్నాయని అరుపులు కేకలు వేసింది. దీంతో చట్టుపక్కల వారు వచ్చి చోరీ జరిగినట్లు పోలీసులకు సమాచారం అందించారు. ఇంటి నుంచి 30 గ్రాంల బంగారు గొలుసు, 10 గ్రాముల బంగారం, 160 గ్రాముల వెండి, 150 గ్రాంల వెండి కాళ్ల పట్టాలు, బంగారు చెవి కమ్మల జత, 30 వేల రూపాయల నగదును గుర్తు తెలియని దొంగలు ఎత్తుకుపో యినట్లు రేండ్ల ప్రమీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. సంఘటన స్థలాన్ని మల్యాల సీఐ దామోధర్‌రెడ్డి, ఇన్‌చార్జ్ ఎస్సై కుమారస్వామి, హెడ్‌కానిస్టేబుల్ అర్షరాజు పరిశీలించారు.

కొత్త రకం మొక్కలు పెంచాలి

మెట్‌పల్లి రూరల్, ఫిబ్రవరి, 1 : ప్రజలకు అవసరమైన కొత్త రకమైన మొక్కలను నర్సరీల్లో పెంచాలని డీఎల్‌పీవో శ్రీనివాస్ సూచించారు. గురువారం మండలంలోని చౌలమద్ది గ్రామంలోని నర్సరీని, పంచాయతీ కార్యాలయంలోని రికార్డులు, మురికి కాలువలు, రోడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని ప్రజలకు అవసరమైన కొత్త మొక్కలు పెంచడానికి విత్తనాలు నాటాలని, నాటిన మొక్కలకు ప్రతి రోజు నీరు పట్టాలని సూచించారు. గ్రామంలోని రోడ్లు, మురికి కాలువలు పరిశీలించి ప్రతి రోజు చెత్తను తొలగించాలి, గ్రామంలోని ఇండ్లలోని చెత్తను సేకరించి డంపింగ్ యార్డులకు తరలించాలన్నారు. గ్రామంలో దోమల బెడద లేకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. పంచాయతీ కార్యాలయలంలోని రికార్డులు పరిశీలించి రోజువారి పనులను గురించి ఎప్పటికప్పుడు నమోదు చేయాలని పలు సూచనలు చేశారు. ఈయన వెంటా పంచాయతీ కార్యదర్శి రవి, కారోబార్ వాసాల రాములు, ఎప్‌ఏ సురేస్, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

వారసులకు పోస్టింగులు ఇవ్వాలని వినతి

కథలాపూర్, ఫిబ్రవరి 1 : గత ప్రభుత్వం 61 ఏళ్లు దాటిన వీఆర్‌ఏల వారసులకు పోస్టింగులు ఇస్తామని జారీ చేసిన 81,85,98 జీఓలను జారీ చేసిందని కేడర్లను నిర్ణయించి వారికి పోస్టింగులు ఇవ్వాలని గురువారం తహసీల్దార్ ముంతా జీబోద్దీన్‌కు వీఆర్‌ఏలు వినతి పత్రం అందించారు. గడిచిన ఆరు మాసాల కిందట జీవోలు జారీ కాబడ్డా నేటికీ అమలు కాలేదని కొత్త ప్రభుత్వం చొరవ చూపి నిర్దేశించిన కేడర్‌లో పోస్టింగులు ఇవ్వాలని కోరారు. గత 40 నుంచి 45 సంవత్సరాలుగా రెవెన్యూ వ్యవస్థలో పనిచేస్తున్నామని ప్రస్తుతం జీతాలు లేక కుటుంబాలు అలమటిస్తున్నాయని పేర్కొన్నారు. సత్తయ్య, బుచ్చిరాజం, నర్సయ్య, మైస పోచయ్య, బత్తుల రాజం, భూమారాజం పాల్గొన్నారు.

పల్లెల్లో ప్రత్యేక పాలనకు అధికారుల నియామకం

మెట్‌పల్లి రూరల్, ఫిబ్రవరి, 1 : పంచాయతీ పాలక వర్గం పదవీ కాలం నేటితో ముగియనుంది. సర్పంచుల పదవీ కాలం పూర్తయ్యేలోగా ఎన్నికల నిర్వ హణ సాధ్యం కాకపోవడంతో కొత్త చట్టం ప్రకారం ప్రత్యేకాధికార పాలన నిర్వహిం చడానికి మండలంలోని 23 గ్రామ పంచాయతీలకు సిద్ధం చేసిన జాబితాను గురువారం జిల్లా అధికారులు అందజేసినట్లు ఎంపీడీవో భీమేష్‌రెడ్డి తెలిపారు. వెల్లుల్ల గ్రామానికి ఎంపీడీవో భీమేష్‌రెడ్డి, బండలింగాపూర్‌కు తహసీల్దార్ శేఖర్, వేంపేటకు డీబ్ల్యూవో భాస్కర్, జగ్గసాగర్‌కు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజు, ఆత్మకూర్‌కు వీఏఎస్ సంకీత్, మేడిపల్లి ఎమ్‌ఏవో షాహిద్‌అలీ, చౌలమద్దికి వీఏఎస్ మనీషాపటేల్, మెట్లచిట్టాపూర్‌కు ఇరిగేషన్ ఏఈ శ్రీధర్, ఆత్మనగర్‌కు నాయబ్ తహసీల్దార్ రాజ్‌మహమ్మద్, కోనరావుపేటకు ఎంపీడీవో భీమేష్‌రెడ్డి, రాజేశ్వర రావుపేటకు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజేందర్, కోండ్రికర్లకు ఆర్‌అండ్‌బీ ఏఈ వేణు, చింతలపేటకు తహసీల్దార్ శేఖర్, పెద్దాపూర్‌కు ఎంపీవో మహేశ్వర్‌రెడ్డి, రామలచ్చక్కపేటకు ఆర్‌డబ్ల్యూఎస్ రాజు, సత్తక్కపల్లికి పీఆర్ ఏఈ అన్వర్, విట్టంపేటకు వీఏఎస్ సంకీత్, చెర్లకొండపూర్‌కు ఎంఏవో షాహిద్‌అలీ, రంగరావుపేటకు ఇరిగేషన్ ఏఈ శ్రీధర్, రామారావుపల్లెకు నాయబ్ తహసీల్దార్ రాజ్‌మహ్మద్, పాటిమీదితండాకు పీఆర్‌ఏఈ అన్వర్, కేసీఆర్‌తండాకు పీఆర్ ఏఈ అన్వర్, ఏఎస్‌ఆర్‌తండాకు ఎంపీవో మహేశ్వర్‌రెడ్డిలను నియమించినట్లు తెలిపారు.

కోరుట్ల రూరల్: గ్రామ సర్పంచ్‌ల పదవి కాలం ముగయడంతో ప్రభుత్వం మండలంలోని 15 గ్రామాలకు ప్రత్యేక అధికారులను నియమించింది. అయాలాపూర్ గ్రామానికి ఎంపీవో నీరజ, పైడిమడుగు డిప్యూటీ తహసీల్దార్ జగదీశ్వర్, మోహన్‌రావుపేట తహసీల్దార్ కిషన్, యూసుఫ్‌నగర్ మండల విద్యాధికారి నరేశం, మాదాపూర్ మండల వెటర్నరీ డాక్టర్ దీరజ్, చిన్నమెట్‌పల్లి మండల వ్యవసాయ అధికారిణీ నాగమణీ, జోగినిపల్లి ఉమెన్ వెల్ఫేర్ శాఖ మండల సూపర్‌వైజర్ సైని, వెంకటాపూర్ ప్రంచాయతీ రాజు మండల జూనియర్ అసిస్టెంట్ మల్లారెడ్డి, దర్మారం మండల రెవ్వెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజారం, నాగులపేట పంచాయతీ రాజు మండల సూపరిండెంట్ శ్రీనివాస్, సంగెం ఉమెన్ వెల్ఫేర్ శాఖ మండల సూపర్‌వైజర్ సమీం సుల్తానా, గుమ్లాపూర్ మండల ఆర్‌డబ్లఎస్ ఎఈ శ్రీనివాస్, కల్లూర్ పంచాయతీ రాజు మండల సీనియర్ అసిస్టెంట్ లక్ష్మయ్య, సర్వరాజు పూర్ పీఆర్ మండల ఎఈ అదిత్య ప్రకాష్, తిమ్మయ్యపల్లి పంచాయతీ రాజు మండల సీనియర్ అసిస్టెంట్ సునితలను గ్రామ ప్రత్యేక అధికారులుగా జిల్లా అధికారులు నియమించారు.

కొడిమ్యాల: మండలంలోని 24 గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారులను జిల్లా ఉన్నతాధికారులు నియమించారు. కొడిమ్యాల గ్రామ పంచాయతీకి తహసీల్దార్ కె. రవికాంత్, పూడూర్ గ్రామపంచాయతీకి ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ మణిదీప్, నాచుపల్లి గ్రామ పంచాయతీకి ఎంపీవో ప్రవీణ్, చెప్యాల గ్రామపంచాయతీకి డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్. క్రిష్ణ, నమిలికొండ గ్రామపంచాయతీకి ఎంపీడీవో ఎ. పద్మజరాణి, తిప్పయ్యపల్లి గ్రామపంచాయతీకి ఏఈ ఆర్‌డబ్ల్యుఎస్(మిషన్ భగీరథ)హరిప్రసాద్, తిర్మాలాపూర్ గ్రామపంచాయతీకి డబ్బుతిమ్మయ్య పల్లి వెటర్నరీ వైద్యుడు డి. శ్రీకాంత్, రామకిష్టాపూర్ గ్రామపంచాయతీకి ఏఈ పీఆర్ చంద్రశేఖర్, నల్లగొండకు కొడిమ్యాల వెటర్నరీ వైద్యుడు పి. ప్రసాద్, డబ్బుతిమ్మయ్యపల్లికి మండల వ్యవసాయాధికారి పి. జ్యోతి, శ్రీరాములపల్లికి ఏఈవో శ్రీలత, కోనాపూర్‌కు సీనియర్ అసిస్టెంట్ బి. సురేష్, కొండాపూర్‌కి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉమ, రాంసాగర్‌కి పంచాయతీ రాజ్ సూపరిండెంట్ కె. సురేందర్, అప్పారావుపేటకి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎన్. సుధారాణి హిమ్మతురావుపేటకు ఏఈవో వి. మంజుల, దమ్మయ్యపేటకి ఏఈవో కె. శ్రీనివాస్, సూరంపేటకి సీనియర్ అసిస్టెంట్ బి. చంద్రిక, గౌరాపూర్‌కి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వి. రవీందర్, గంగారాంతండాకి జూనియర్ అసిస్టెంట్ కె. గంగారాం, తురుకకాశీనగర్‌కు జూనియర్ అసిస్టెంట్ ఎ. నిఖిల, చింతల్లపల్లికి జూనియర్ అసిస్టెంట్ మహ్మద్ సాజిత్, నర్సింహులపల్లికు ఏఈవో గ్రీష్మ, శనివారంపేటకి టైపిస్ట్ జె. అరుణ్‌చందర్‌ను నియామకం చేశారు.

కథలాపూర్ : గ్రామ పంచాయతీ సర్పంచుల పదవీకాలం గురువారంతో పూర్తయిన నేపథ్యంలో నేటి నుంచి ప్రత్యేకాధికారుల పాలనకు ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. అయితే మొన్నటి దాకా అన్ని శాఖల నుంచి ఏదేని కేడర్ స్థాయి అధికారులను కేటాయించవచ్చని చెప్పినప్పటికీ గెజిటెడ్ అధికారులను మాత్రమే కేటాయిస్తూ రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. సిరికొండ, దుంపెట, ఊట్‌పల్లి ఎంపీడీవో జనార్ధన్‌కు, తాండ్ర్యాల, పోతారం తహసీల్దార్ ముంతాజీబోద్దీన్, అంబారిపేట, ఇప్పపల్లి పశువైద్యాధికారి శ్రీనివాస్‌కు, తక్కళ్ళపల్లి, దూలూరు మిషన్ భగీరథ ఏఈ అనిల్, చింతకుంట, పోసానిపేట వ్యవసాయాధికారి యోగిత, గంభీర్‌పూర్, భూషణరావుపేట, పెగ్గెర్ల ఆర్‌డబ్లుఎస్ ఏఈ చంద్రశేఖర్, బొమ్మెన, కలికోట నాయబ్ తహసీల్దార్ శ్రీనివాస్, తుర్తి, రాజారం తండాకు అంబారిపేట పీహెచ్‌సీ సీహెచ్‌ఓ ఎస్‌ఆర్ వెంకటేశ్వర్లు, కథలాపూర్‌కు మండల ప్రత్యేకాధికారి, జిల్లా అటవీ అధికారి వెంకటేశ్వర్‌రావుకు బాధ్యతలు అప్పగించారు. వీరు శుక్రవారం గ్రామ పంచాయతీల్లో విధుల్లో చేరాలని ఆదేశాలు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

నూతన ఎమ్మెల్సీకి సన్మానం

ధర్మపురి, ఫిబ్రవరి 1: ఎమ్మెల్సీగా నియమితులైన టీపీసీసీ వర్కింగ్ ప్రసిడెంట్ మహేష్ కుమార్‌గౌడ్‌ను హైదరాబాద్‌లో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ శుక్రవారం కలిసి పుష్పగుచ్చం అందింది అభినందించారు. ఇదిలా ఉండగా రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ గురువారం రాత్రి ధర్మపురికి చేరుకున్నారు. మంత్రికి విప్ లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి స్వాగతం పలికారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం

పెగడపల్లి, ఫిబ్రవరి 1 : సమస్యల సత్వర పరిష్కారమే ప్రభుత్వ విప్ ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ధ్యేయమని మండల కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. గురువారం పార్టీ మండల కార్యాలయంలో పార్టీ అధ్యక్షుడు బుర్ర రాములు గౌడ్ ఆ పార్టీ నాయకులతో కలసి విలేఖరులతో మాట్లాడుతూ మండలంలోని కీచులాటపల్లి గ్రామానికి చెందిన కొందరు రైతులకు పంట పొలాలకు వెల్లే దారి విషయంలో కొన్నేండ్లుగా నెలకొన్న సమస్యను పరిష్కరించి రహదారి ఏర్పాటు చేశామన్నారు. సమస్యను తన దృష్టికి రాగానే స్పందించి పరిష్కరించడం లక్ష్మణ్ కుమార్ ధ్యేయమని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు సంది మల్లారెడ్డి, సర్పంచ్ ఇస్లావత్ రవినాయక్, నాయకులు కడారి తిరుపతి, ఆకుల విష్ణు, అజయ్ కుమార్, వంశీదర్‌రావు, రాజేందర్ పాల్గొన్నారు.

ఇద్దరు గంజాయి విక్రేతల అరెస్ట్

ధర్మపురి, ఫిబ్రవరి 1: ధర్మపురి మండలంలోని తుమ్మెనాల గుట్ట వద్ద గంజాయి విక్రయించే యత్నంలో ధర్మారం అశోక్, అనవేణి గంగాధర్‌లను అరెస్ట్ చేసి గురవారం రిమాండ్‌కు పంపించినట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ధర్మపురి సీఐ ముత్యం తెలిపారు. సారంగాపూర్ మండలంలోని రంగపేటకు చెందిన అశోక్, గంగాధర్ జనవరి 31న 150 గ్రాముల గంజాయి తీసుకొని బయట విక్రయించేందుకు బయలుదేరారు. అందిన పక్కా సమాచారం మేరకు తుమ్మెనాల గుట్ట వద్ద నిఘా వేసి పట్టుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. అనంతరం వారిద్దరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపించినట్లు ఆయన వివరించారు.

సర్పంచులకు సన్మానం

రాయికల్, ఫిబ్రవరి 1: సర్పంచుల కాలం ముగుస్తున్న సందర్భంగా రాయికల్ మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులకు ఆత్మీయ సన్మాన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచులను శాలువాలు, మెమోంటోలతో సత్కరించారు. 2019-24 కాలంలో విజయవంతంగా బాధ్యతలు నిర్వర్తించిన సర్పంచులను పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సంధ్యారాణి, జడ్పీటీసీ జాదవ్ అశ్విని, ఎంపీడీవో గంగుల సంతోష్ కుమార్, తహసీల్దార్ ఖయ్యూం, ఎంపీవో సుష్మా, వైస్ ఎంపీపీ, ఎంపీటీసీలు, కో ఆప్షన్ సభ్యులు, సర్పంచులు, సిబ్బంది పాల్గొన్నారు.

5న సబ్ కా యోజన సబ్ కా వికాస్‌పై అవగాహన

కథలాపూర్, ఫిబ్రవరి 1 : కేంద్ర ప్రభుత్వం ఆధ్వ ర్యంలో సబ్ కి యోజన..సబ్ కి వికాస్ పథకం కింద 2024-25 ఆర్థిక సంవత్సరంలో చేపట్టనున్న పనుల గుర్తింపు కోసం ఈ నెల 5న ప్రత్యేక సమావేశం నిర్వహిం చనున్నట్టు ఎంపీపీ జవ్వాజి రేవతి తెలిపారు. మండల పరిషత్ అభివృద్ధి ప్రణాళికను రూపొందించి ఆమోదం తెలిపాల్సి ఉందన్నారు. సీఎఫ్‌సి కింద మండల పరిషత్‌కు కేటాయించిన బడ్జెట్‌కు అనుకుణంగా పనులను ప్రాధాన్య క్రమంలో గుర్తించి పోర్టల్‌లో నమోదు చేయాల్సి ఉంటున్నందు వల్ల సభ్యులు సకాలంలో సమావేశంకు హాజరు కావాలని కోరారు.

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు

కథలాపూర్, ఫిబ్రవరి 1 : మండలంలోని పలు గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలకుగాను మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రు. 65 లక్షలు మంజూరైనట్టు వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. పనులు గ్రామాల్లో చేపట్టనున్నామన్నారు.

రెడ్డి సంఘం అధ్యక్షుడిగా వెంకట్‌రెడ్డి

కొడిమ్యాల, ఫిబ్రవరి 1 : మండలంలోని తిప్పయ్యపల్లి గ్రామ రెడ్డి సంఘం అధ్యక్షుడిగా జంకె వెంకట్‌రెడ్డిని గురువారం సంఘం సభ్యులు ఎన్నుకున్నారు. ఉపాధ్య క్షుడిగా దారం కిషన్‌రెడ్డి, కోశాధికారిగా ఊకంటి రమణారెడ్డి, ప్రధానకార్యదర్శిగా కుందనపల్లి తిరుపతిరెడ్డి, సంయుక్త కార్య దర్శిగా నరెడ్ల గౌతంరెడ్డి, ప్రధాన సలహదారునిగా గట్ల మల్లారెడ్డి, సలహాదారుడిగా అట్ల రాజేశ్వర్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా రవీందర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, రత్నాకర్‌రెడ్డి, మల్లారెడ్డిని సభ్యులు ఎన్నుకున్నారు.

యజ్ఞశాల నిర్మాణానికి భూమిపూజ

పెగడపల్లి, ఫిబ్రవరి 1 : మండల కేంద్రంలోని స్వయంభూ శ్రీరా జరాజేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో యజ్ఞశాల నిర్మాణానికి గాను గురువారం భూమి పూజ చేసి శంఖుస్థాపన చేశారు. యజ్ఞశాల నిర్మాణానికి మాజీ సర్పంచ్ జాల తిరుపతిరెడ్డి గంగ దంపతులు ముందుకురాగా ఆలయకమిటీ ఆధ్వర్యంలో నిర్మాణానికి తీర్మానించి భూమపూజ చేశారు. జాల తిరుపతిరెడ్డి గంగ,కమిటీ సభ్యులు వెంకటేశం, గంగుల కొమురెల్లి, ఆలయ అర్చకులు శ్రీనివాస శర్మ, శివదీక్షాపరులు పాల్గొన్నారు.